శనివారం
12-11-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 140
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

800 కోట్లకు ప్రపంచ జనాభా



ప్రపంచ జనాభా మరో నాలుగు రోజుల్లో అంటే ఈనెల 15వ తేదీకి 800 కోట్ల (ఎనిమిది బిలియన్లు)కు చేరుతుందని ఐక్యరాజ్యసమితి (ఐరాస) తాజా నివేదిక పేర్కొంది.

2లో

మోదీ... గోబ్యాక్

అక్రమ అరెస్టులు... నిర్బంధాలు

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని ప్రైవేటుపరం చేయబోనని ప్రధాని మోదీ ప్రకటించాలని కోరుతూ విశాఖ నగరంలో అన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లో విధులకు హాజరైన ఉద్యోగులు, కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి, నిరసనలు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు సామూహికంగా విధులు బహిష్కరించారు.

- నల్లబ్యాడ్జీలతో ఉక్కు కార్మిక కుటుంబాల నిరసన
- పోలీసు స్టేషన్లకు నాయకులు, కార్మికుల తరలింపు
- అరెస్టులపై భగ్గుమన్న నేతలు

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఉద్యోగులు, కార్మికులు శుక్రవారం నిరసనలకు దిగారు. విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు కుటుంబ సభ్యులతో పాటు కార్మికులు రోడ్డెక్కారు. విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధాని నరేంద్రమోదీకి తమ సత్తా చాటడానికి రెట్టించిన ఉత్సాహంతో ఆందోళనకు దిగారు. నల్లబ్యాడ్జీలతో దీక్ష శిబిరంలో కూర్చుకున్నారు. 'మోదీ...మా గోడు వినవా' అంటూ నినదించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో 638 రోజులుగా విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఉద్యోగులు, కార్మికులతో పాటు కుటుంబ సభ్యులు నల్ల బ్యాడ్జీలతో దీక్షా శిబిరంలో శాంతియుతంగా నిరసన చేస్తుంటే వైసీపీ ప్రభుత్వం విచక్షణారహితంగా వ్యవహరించింది. చిన్నా, పెద్దా, పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా దొరికిన వారిని దొరికినట్లు అరెస్టులకు పూనుకుంది. అరెస్టులకు

- మిగతా 2 లో



ఏపీ ద్రోహి మోదీ

రాష్ట్రవ్యాప్తంగా దద్దరిల్లిన నినాదం

- విశాఖ ఉక్కును ప్రైవేటీకరించబోమని చెప్పాలి
- ప్రత్యేక హోదా ప్రకటించాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర-తిరుపతి బ్యూరో: ఏపీకి తీరని అన్యాయం, రాష్ట్ర ప్రజలకు నమ్మక ద్రోహం చేసిన 'మోదీ గో బ్యాక్' అంటూ రాష్ట్ర ప్రజలు నినదించారు. ఆంధ్రుల ఆత్మ గౌరవమైన విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మకానికి పెట్టిన ఆంధ్రా ద్రోహి ప్రధాని నరేంద్ర మోదీకి ఏపీలో పర్యటించే హక్కు లేదని, మోదీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ప్రధాని ఏపీ పర్యటనను పురస్కరించుకుని శుక్రవారం వామపక్షాల అధ్వర్యాన రాష్ట్రవ్యాప్త నిరసనలు చేపట్టారు. తిరుపతి నగరంలో నల్లబ్యాడ్జీలు, చొక్కాలతో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. బైరాగి పట్టెడ పద్మావతి పార్క్ వద్ద ధర్నా జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం చేసి, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు ఆజ్యం పోస్తున్న మోదీకి ఆంధ్రాలో పర్యటించే హక్కు లేదన్నారు. రాష్ట్రంలో పర్యటించాలంటే విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయబోమని మోదీ ప్రకటన చేయాలని, ఏపీకి ప్రత్యేక హోదాను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరోక్షంగా

- మిగతా 2 లో

విశాఖపై నిఘా నేత్రం

వేలాది మంది పోలీసులతో బందోబస్తు

2లో

త్వరలో మంచి రోజులు

- 8 ఏళ్ల తర్వాత మోదీని కలిశా
- రాష్ట్ర పరిస్థితులన్నీ వివరించా: మీడియాతో పవన్ కల్యాణ్

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో 8 ఏళ్ల తర్వాత మళ్లీ భేటీ అయ్యానని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. శుక్రవారం రాత్రి ఐఎన్‌ఎస్ చోళలో 35 నిమిషాల పాటు మోదీతో భేటీ అనంతరం పవన్ కల్యాణ్ నోవాటెల్‌కు చేరుకొని అక్కడ వేచి ఉన్న మీడియాతో మాట్లాడారు. రెండు రోజుల క్రితం ప్రధానమంత్రి కార్యాలయం నుంచి తనకు ఫోన్ వచ్చిందని, విశాఖ పర్యటన సందర్భంగా ప్రధానమంత్రిని కలిసే అవకాశం దక్కిందన్నారు. 2014 నుండి అనేకసార్లు తాను దిల్లీ వెళ్లినప్పటికీ మోదీతో సమావేశం కాలేకపోయానని, ఇప్పుడు ఆ అవకాశం వచ్చిందన్నారు. ఈ కలయిక చాలా ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. రాష్ట్రంలో ఉన్న పరిస్థితులన్నీ వివరించానని, మోదీ కూడా అన్ని విషయాలను శ్రద్ధగా అడిగి తెలుసుకున్నారని పవన్ చెప్పారు. రాష్ట్ర అభివృద్ధిపై ప్రధానికి ఆకాంక్ష ఉందని, త్వరలోనే ఆంధ్రప్రదేశ్ మరింత అభివృద్ధి చెందడానికి తమ భేటీ దోహదపడుతుందని పవన్ ఆశాభావం వ్యక్తం చేశారు. తెలుగు ప్రజల ఐక్యత వర్ధిల్లాలి అనేది మోదీ ఆకాంక్ష అన్నారు. త్వరలోనే మంచి రోజులు వస్తాయని భావిస్తున్నానన్నారు. అంతకుముందు మోదీ రోడ్ షో ముగించుకొని వచ్చిన వెంటనే పవన్‌తో భేటీ అయ్యారు. ఈ భేటీలో కీలక అంశాలు ప్రస్తావనకు వచ్చాయని జనసేన వర్గాలు చెబుతున్నాయి. ఐదు పేజీల నోట్‌ను మోదీకి పవన్ అందజేసినట్లు తెలుస్తోంది. వైసీపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, వివిధ వర్గాలు పడుతున్న ఇబ్బందులను మోదీతో పవన్ ప్రస్తావించినట్లు సమాచారం. ప్రతిపక్షాలపై అక్రమ కేసులు, విశాఖ, ఇప్పటం ఘటనలను మోదీ దృష్టికి పవన్ తీసుకువెళ్లినట్లు జనసేన నేతలు చెబుతున్నారు. ముఖ్యంగా మూడు రాజధానుల అంశం, విశాఖలో రాజధాని పేరిట వైసీపీ ప్రభుత్వ పెద్దలు చేస్తున్న భూ దందాలపై వెలుగు చూసిన ఆధారాలతో కూడిన పత్రాలను మోదీకి పవన్ అందించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, రైల్వే జోన్ వంటి అంశాలపైనా మోదీ వద్ద ప్రస్తావన చేసినట్లు సమాచారం. కొంతమంది బీజేపీ నేతల వ్యవహారశైలిపై పవన్ గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది. తన వైఖరిని మోదీకి స్పష్టంగా చెప్పాలని పవన్ అడిగినట్లు సమాచారం. అమరావతి అంశంలో నలుగురు బీజేపీ నేతల వ్యవహారశైలిపై ఇప్పటికే కేంద్రమంత్రి అమిత్ షా సహా బీజేపీ ముఖ్యనేతలకు పవన్ ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వబోమని రెండోసారి పవన్ పునరుద్ఘాటించిన విషయం తెలిసిందే.

ప్రధానితో గవర్నర్, సీఎం జగన్ భేటీ నేడు

ప్రధానమంత్రి నరేంద్రమోదీతో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం భేటీకానున్నారు.

2లో

మోడీగారు వచ్చేలోగా స్టేజీ ఖాళీగా ఎందుకని చిన్న భజన కార్యక్రమం!

23 వేల ఇంజినీరింగ్ సీట్లు ఖాళీ

- కన్వీనర్ కోటాలో లక్షా 13 వేల 403
- భర్తీ అయినవి 90,100
- ప్రైవేటులో అత్యధికంగా 21,507 మిగులు
- స్పెషల్ రౌండ్ సీట్ల విడుదల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ ఈఏపీసెట్-2022 స్పెషల్ రౌండ్ (తుది విడత) వెబ్ కౌన్సెలింగ్ అనంతరం 23,303 ఇంజినీరింగ్ సీట్లు భర్తీకి నోచుకోలేదు. ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో 21,507 సీట్లు మిగిలాయి. స్పెషల్ రౌండ్‌లో ఇంజినీరింగ్ సీట్ల భర్తీ వివరాలను శుక్రవారం కన్వీనర్ సి.నాగరాణి ప్రకటించారు. 2022-23 విద్యా సంవత్సరానికిగాను నిర్వహించిన ఏపీఈఏపీసెట్-2022కు 1,73,572 మంది అర్హత సాధించగా, కన్వీనర్ కోటా కింద 250 ప్రభుత్వ, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో లక్షా 13వేల 403 సీట్లు ఉన్నాయి. మూడు విడతలుగా వెబ్ కౌన్సెలింగ్ జరిగింది. రెండో విడత కౌన్సెలింగ్ పూర్తయ్యాక కూడా ఇంజినీరింగ్ సీట్లు మిగిలాయి. చాలా మంది అభ్యర్థుల వినతుల దృష్ట్యా స్పెషల్ రౌండ్ వెబ్ కౌన్సెలింగ్‌కు కన్వీనర్ షెడ్యూలు జారీజేశారు. ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకు కౌన్సెలింగ్ జరిగింది. స్పెషల్ రౌండ్‌లో 24,142 మంది ఆప్షన్లు పెట్టుకున్నారు. కొత్తగా 3,458 మందికి ప్రవేశాలు కల్పించారు. మరో 9,958 మంది స్లైడింగ్ అయ్యారు. ఇంకా 23,303

- మిగతా 2 లో

జగన్ సర్కారుకు మరో ఎదురుదెబ్బ

- రాజధాని మాస్టర్ ప్లాన్ మార్పుపై చుక్కెదురు
- 17 గ్రామాల్లో సభలకు హైకోర్టు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాజధాని అమరావతి మాస్టర్ ప్లాన్ మార్పుపై జగన్ సర్కారుకు హైకోర్టులో మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. రాజధానిలోని 17 గ్రామాల్లో రెండు రోజుల్లోగా గ్రామ సభలు నిర్వహించి సవరణలపై రైతుల అభిప్రాయాలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. రాజధాని అమరావతిలో స్థానికేతరులకు ఇళ్ల స్థలాల పంపిణీపై గ్రామసభలు నిర్వహించకుండానే అభ్యంతర పత్రాలు కోరుతున్నారంటూ రైతులు దాఖలు చేసిన లంచ్‌మోషన్ పిటిషన్‌ను హైకోర్టు విచారణకు స్వీకరించిన విషయం విదితమే. దీనిపై హైకోర్టు విచారించి మిగిలిన 17 గ్రామాలకు సంబంధించి రెండు రోజుల్లో గ్రామ సభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. రాజధాని అమరావతి కోసం రైతులు ఇచ్చిన భూముల్లో రాజధానేతర ప్రాంత ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సీఆర్డీఏ సవరణ చట్టం(యాక్ట్-13) తీసుకొచ్చింది. రెసిడెన్షియల్ జోన్-5లో అందుకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్‌లో సవరణలకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రజల నుంచి అభ్యంతరాల స్వీకరణకుగాను ఆయా గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు ప్రకటన జారీజేశారు. వాటిని సవాల్ చేస్తూ మందడం, లింగాయపాలెం గ్రామస్థులు హైకోర్టును ఆశ్రయించారు. సీఆర్డీఏ నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా పాటించలేదని, ముందుగా రాజధాని ప్రాంతంలో ఉన్న వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చాకే, మిగిలిన అంశాలు చూడాలని రైతుల తరఫు న్యాయవాది ధర్మాసనాన్ని కోరారు. గ్రామసభలు నిర్వహించకుండా అభ్యంతర పత్రాలు అడుగుతున్నారని, వ్యక్తిగతంగా నోటీసులు జారీజేస్తున్నారని తెలిపారు. దీనిపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.రమేశ్ విచారించి... 17 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు.

రాజీవ్ హంతకులకు విముక్తి

ఆరుగురు దోషుల విడుదలకు సుప్రీం ఆదేశాలు

న్యూదిల్లీ: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ హత్య కేసులో దోషులందరినీ(ఆరుగురు) విడుదల చేయాలని సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశించింది. ఈ ఏడాది మే 18న ఏజీ పెరరివలన్‌ను విడుదల చేస్తూ తీర్పు చెప్పడానికి అనుసరించిన విధానాన్నే మిగిలిన దోషుల విషయంలోనూ అమలు చేశామని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలిచ్చింది. ఈ కేసులో ఆరుగురు దోషులు జీవిత ఖైదు అనుభవిస్తున్న సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు

- మిగతా 2 లో

జీ20, అపెక్ సదస్సులకు జిన్‌పింగ్

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో తొలి భేటీ

ఫ్రాన్స్, అర్జెంటైనా తదితర దేశాధ్యక్షులతో ద్వైపాక్షిక చర్చలు

బీజింగ్: చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఈనెల 14-17 తేదీల్లో ఇండోనేసియాలోని బాలిలో జరగబోయే జీ20 సదస్సులో పాల్గొంటారని చైనా విదేశాంగ శాఖ శుక్రవారం ప్రకటించింది. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో జిన్‌పింగ్ తొలిసారి ప్రత్యక్షంగా భేటీ అవుతారని, రెండు దేశాధినేతలు ద్వైపాక్షిక చర్చలు జరుపుతారని తెలిపింది. ఈనెల 17-19 తేదీల్లో థాయిలాండ్, బాంకాక్‌లో జరగనున్న ఆసియా-పసిఫిక్ ఆర్థిక సహకార (అపెక్) సదస్సులోనూ జిన్‌పింగ్ పాల్గొంటారనని ఆర్థికశాఖ అధికార ప్రతినిధి హువా చుయింగ్ వెల్లడించారు. చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా మూడవసారి ఎన్నికైన తర్వాత జిన్‌పింగ్‌కు ఇది మొదటి విదేశీయానం. ఆయన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్, సెంగలీస్ అధ్యక్షుడు మాకీసాల్, అర్జెంటైనా అధ్యక్షుడు అల్బెర్టో ఫెర్నాడెజ్ తదితర దేశాధ్యక్షులతోనూ ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహిస్తారు. బైడెన్ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత జిన్‌పింగ్‌తో ఇది తొలి భేటీ కాగా ఇద్దరు కలిసి అనేక వర్చువల్ సమావేశాల్లో పాల్గొన్నారని హువా తెలిపారు.

ఇలినాయ్ అసెంబ్లీకి ఎన్నికైన నబీలా సయ్యద్

చరిత్ర సృష్టించిన ఇండో-అమెరికన్ ముస్లిం యువతి

వాషింగ్టన్: అమెరికా మధ్యంతర ఎన్నికల్లో భారత సంతతికి చెందిన అమెరికన్ అయిన 23 ఏళ్ల ముస్లిం యువతి నబీలా సయ్యద్ చరిత్ర సృష్టించారు. ఇలినాయ్ జనరల్ అసెంబ్లీలో అత్యంత పిన్నవయస్సుగల సభ్యురాలిగా ఎన్నికయ్యారు. ఇల్లినోయిస్ రాష్ట్ర 51వ జిల్లా ప్రతినిధుల సభ రేసులో నిలిచిపోటీ చేసి తన సమీప ప్రత్యర్థి, రిపబ్లికన్ క్రిస్ బోస్‌ను డెమొక్రాట్ నబీలా సయ్యద్ ఓడించారు. ఈమెకు 52.3శాతం ఓట్లు వచ్చాయి. తన గెలుపు గురించి నబీలా సయ్యద్ ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రకటించారు. తన వయస్సు 23 ఏళ్లు అని, భారత సంతతి అమెరికన్ ముస్లింనని, డెమొక్రాట్‌గా రిపబ్లికన్‌ను ఓడించానని వెల్లడించారు.

జనవరిలో అత్యంత పిన్నవయస్సుగల సభ్యురాలిగా ఇల్లినోయిస్ జనరల్ అసెంబ్లీలో అడుగు పెడతానని తెలిపారు. రాష్ట్ర శాసనసభలో తొలి సౌతేషియన్ కూడా ఈమె కావడం విశేషం. నబీలా సయ్యద్ పొలిటికల్ సైన్స్ గ్రాడ్యుయేట్. బెర్కిలీలోని కాలిఫోర్నియా యూనివర్సిటీ నుంచి బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ పట్టా పొందారు. సామాజిక మాధ్యమం ద్వారా తన రాజకీయ అనుభవాలను పంచుకున్నారు. ఇంటింటికి వెళ్లి తలుపు తట్టి మందుల ధరల పెంపు, ఆస్తి పన్నుల భారం, మహిళల కోసం ప్రసూతి ఆరోగ్య సంరక్షణ, తుపాకీ సంస్కృతి క్రమంలో భద్రత గురించి పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడినట్లు, ఓట్లు అడిగినట్లు తెలిపారు. మరోమారు ఇంటింటికి వెళ్లి తనకు ఓట్లు వేసి గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలుపుతానని ఇన్‌స్టాగ్రామ్‌లో నబీలా సయ్యద్ వెల్లడించారు.

51వ జిల్లా ప్రతినిధిగా స్థానికుల సమస్యల పరిష్కారానికి పోరాడతానని ప్రతి కుటుంబానికి హామీనిస్తున్నా అని పేర్కొన్నారు. కాగా, ఈనెల 8న మధ్యంతర ఎన్నికలు జరిగిన విషయం విదితమే.

800 కోట్లకు ప్రపంచ జనాభా

వచ్చే ఏడాది చైనాను దాటేస్తోన్న భారత్

2050కి సగానికిపైగా జనాభా 8 దేశాల్లోనే : ఐరాస నివేదిక

జెనీవా: ప్రపంచ జనాభా మరో నాలుగు రోజుల్లో అంటే ఈనెల 15వ తేదీకి 800 కోట్ల (ఎనిమిది బిలియన్ల)కు చేరుతుందని ఐక్యరాజ్యసమితి (ఐరాస) తాజా నివేదిక పేర్కొంది. వచ్చే ఏడాదికి ప్రపంచంలోనే అత్యధిక జనాభాగల దేశంగా భారత్ నిలుస్తుందని తెలిపింది. చైనాను వెనక్కినెట్టి వేస్తుందని పేర్కొంది. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా విడుదల చేసిన నివేదికలో ఐరాస ఈ మేరకు వివరాలను వెల్లడించింది. 1950 తర్వాత తొలిసారిగా 2020లో ప్రపంచ జనాభా పెరుగుదల ఒక శాతం కంటే తక్కువగా నమోదు అయినట్లు ఐరాస పేర్కొంది. ప్రపంచ జనాభా తాజా అంచనా 1950తో పోలిస్తే మూడు రెట్లు అధికమని, 2030 నాటికి ఈ సంఖ్య 850 కోట్లకు చేరుతుందని తెలిపింది. 2050 నాటికి అంచనా వేసిన జనాభాలో సగానికిపైగా ఎనిమిది దేశాల్లో (కాంగో, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండియా, నైజీరియా, పాకిస్థాన్, ఫిలిప్పీన్స్, టాంజానియా)లో పెరుగుతుందని నివేదిక తెలిపింది. ప్రపంచ జనాభా 2030లో 8.5 బిలియన్లకు, 2050లో 9.7 బిలియన్లకు, 2080లో గరిష్ఠంగా 10.4 బిలియన్లకు చేరుకుని 2100 వరకు అదే స్థాయిలో ఉంటుందని ఐరాస అంచనా వేసింది. మెజారిటీ సబ్-సహారా ఆఫ్రికన్ దేశాలు, ఆసియా, లాటిన్ అమెరికా, కరేబియన్‌లోని ప్రాంతాలు ఇటీవలి సంతానోత్పత్తి క్షీణత ఫలితంగా జనాభా వైవిధ్యం ఉందని తెలిపింది. దీని కారణంగా పని చేసే వయస్సులో ఉన్న జనాభా నిష్పత్తిలో పెరుగుదల (25 నుంచి 64 వయసు) తలసరి వేగవంతమైన ఆర్థిక వృద్ధికి అవకాశాన్ని అందిస్తుంది. 'మన వైవిధ్యాన్ని జరుపుకోవడానికి, ఉమ్మడి మానవత్వాన్ని గుర్తించడానికి, జీవితకాలాన్ని పొడిగింపు, మాతాశిశు మరణాల రేటును నాటకీయంగా తగ్గించిన ఆరోగ్యంలో పురోగతిని చూసి ఆశ్చర్యపోవడానికి ఇది ఒక సందర్భం'అని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి గుటెర్రస్ వ్యాఖ్యానించారు. సుస్థిరత, స్థిరమైన లక్ష్యాల బాధ్యతపై ప్రస్తావిస్తూ 'ఇది భూగ్రహంపై శ్రద్ధ వహించడానికి మన ఉమ్మడిబాధ్యతను గుర్తుచేస్తుంది. మనందరికి ఇది ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన సమయం' అని ఆయన నొక్కిచెప్పారు.

వెనిజులా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా

ఆస్కార్ ఫిగురా తిరిగి ఎన్నిక

కారకస్: వెనిజులా కమ్యూనిస్టు పార్టీ (పీసీవీ) ప్రధాన కార్యదర్శిగా ఆస్కార్ ఫిగురా తిరిగి ఎన్నికయ్యారు. ఫిగురాకు పీసీవీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్న నూతన కేంద్ర కమిటీ... పార్టీ అధ్యక్షుడిగా ఫర్ఫెక్టో అబ్రూ నేవెస్‌ను నియమించింది. తొలి ప్లీనరీ సమావేశంలో ఫిగురా మాట్లాడుతూ, పీసీవీ 16వ జాతీయ మహాసభ విజయవంతం అయిందన్నారు. పీసీవీ స్వయంప్రతిపత్తిగల స్వతంత్ర, మార్క్సిస్టు- లెనినిస్టు సంస్థ అని అన్నారు. అనేక చరిత్రాత్మక ప్రజా పోరాటాలు నిర్వహించిందని, బాహ్య ఒత్తిళ్లు, అణచివేత చర్యలను తిప్పిగొట్టగలిగిందన్నారు. కాగా, నూతన కేంద్ర కమిటీలో 22 మంది మహిళలు, 42 మంది పురుషులు ఉండగా వీరిలో 22 మంది కొత్తవారు ఉన్నారు. దీంతో రెన్యూవల్ రేటు 35.48శాతంగా ఉన్నదని పార్టీ వర్గాలు తెలిపాయి.

విశాఖపై నిఘా నేత్రం

విశాలాంధ్ర-విశాఖపట్నం: ప్రధాని నరేంద్రమోదీ రెండు రోజుల పర్యటన కోసం విశాఖ నగరంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. వేలాది మంది పోలీసులతో బందోబస్తు కల్పించారు. 'ఐఎన్ఎస్ డే'గా విమానాశ్రయం నుంచి మొత్తం మూడు కిలోమీటర్ల మేర రెండువైపులా ప్రజలకు అభివాదం చేస్తూ తూర్పు నౌకాదళ స్థావరంలోని ఐఎన్ఎస్ చోళా వరకు ర్యాలీ జరిగింది. శనివారం ఉదయం ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో రూ.15,233 కోట్ల విలువైన తొమ్మిది ప్రాజెక్టుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాలను ప్రధాని మోదీ చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌తో పాటు ముఖ్యమంత్రి జగన్ హాజరు కానున్నారు. శనివారం ఏయూ గ్రౌండ్స్‌లో జరిగే బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా రూ.15,233 కోట్ల విలువైన 9 ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.

బహిరంగసభ వేదికపైకి ఎనిమిది మందికే అనుమతి

ప్రధాని పాల్గొనే బహిరంగ సభ వేదికపైకి ఎనిమిదిమందికే అనుమతి లభించింది. ప్రధాని వేదికపై గవర్నర్, సీఎం, కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్, ఎమ్మెల్సీ మాధవ్, వాకాటి, జీవీఎల్ నరసింహారావు, సీఎం రమేశ్, విశాఖ ఎంపీకి అనుమతి లభించింది. ఈ సమావేశంలో మాట్లాడేందుకు సీఎం జగన్‌కు ఏడు నిమిషాల సమయం ఇచ్చారు. విశాఖ సభలో ప్రధాని మోదీ దాదాపు 40 నిమిషాలు ప్రసంగించనున్నారు. బహిరంగ సభకు కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ అధ్యక్షత వహించనున్నారు.

ప్రధానితో గవర్నర్, సీఎం జగన్ భేటీ నేడు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ప్రధానమంత్రి నరేంద్రమోదీతో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం భేటీకానున్నారు. బహిరంగ సభకు ముందుగానే ప్రధానితో వీరిద్దరు సమావేశం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. శుక్రవారం రాత్రి బీజేపీ నేతలు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రధానిని కలిశారు. ప్రధాని ఐఎన్ఎస్ చోళలో బస చేయగా...గవర్నర్ నోవాటెల్ హోటల్‌లో, సీఎం పోర్టు అతిథిగృహంలో బస చేశారు. శనివారం ఉదయం గవర్నర్, ముఖ్యమంత్రి రోడ్డు మార్గాన ఐఎన్ఎస్ చోళకు వెళ్లి ప్రధానితో సమావేశమవుతారు. అనంతరం అక్కడ నుంచి హెలికాప్టర్‌లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన సభావేదిక వద్దకు వస్తారు. ఉదయం 9.40 గంటలకు సీఎం ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ మైదానంలోని హెలిపాడ్ వద్దకు వస్తారు. చోళ గెస్ట్‌హౌస్ నుంచి మోదీ నేవీ హెలికాప్టర్‌లో సభాస్థలికి 10.20 గంటలకు వస్తారు. 10.30 గంటల నుంచి 11.45 గంటల వరకు ప్రధాని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అది పూర్తికాగానే హెలికాప్టర్‌లో బయలుదేరి 12.20 గంటలకు ఐఎన్ఎస్ డేగాకు చేరతారు. అక్కడ సీఎం తదితరులు వీడ్కోలు పలుకుతారు. తర్వాత సీఎం జగన్ 12.45 గంటలకు విజయవాడ బయలుదేరి వెళతారు.

మోదీకి గవర్నర్, సీఎం స్వాగతం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం రాత్రి విశాఖ నగరానికి చేరుకున్నారు. ప్రధాని ప్రయాణించిన ప్రత్యేక విమానం విశాఖపట్నం విమానాశ్రయం సమీపంలోని ఐఎన్ఎస్ డేగ వద్ద దిగింది. అక్కడ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధానికి ఘనస్వాగతం పలికారు. తమిళనాడులోని మధురైలో వర్షం కారణంగా మోదీ విమానం గంట ఆలస్యంగా విశాఖకు చేరుకుంది. సాయంత్రం 6:30 గంటలకే విశాఖ చేరుకున్న గవర్నర్, ముఖ్యమంత్రి రెండు గంటలపాటు ప్రధాని కోసం నిరీక్షించారు. ఐఎన్ఎస్ డేగ నుంచి రోడ్డు మార్గంలో మారుతీ జంక్షన్‌కు మోదీ చేరుకున్నారు. అక్కడ బీజేపీ శ్రేణులు ప్రధానికి ఘన స్వాగతం పలికారు. అక్కడికి చేరుకున్నవారికి మోదీ అభివాదం చేశారు. భారీ పోలీసు బందోబస్తు నడుమ రోడ్ షో నిర్వహించారు. 1.5 కిలోమీటర్ల మేర మోదీ రోడ్ షో సాగింది.

అక్రమ అరెస్టులు... నిర్బంధాలు

(మొదటిపేజీ తరువాయి)

భయపడేది లేదని, ఉక్కు పరిరక్షణ తమ లక్ష్యమని వృద్ధులు, మహిళలు, పిల్లలు కూడా పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అనేక మందిని పోలీసు వాహనాల్లో ఎత్తిపడేశారు. విశాఖ నగరానికి దూరంగా ఉన్న పోలీస్ స్టేషన్లకు తరలించారు. గోపాలపట్నం, పెందుర్తి, సబ్బవరం, కొత్తవలస, భీమిలి, ఆనందపురం పోలీసుస్టేషన్లకు తీసుకెళ్లారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని ప్రైవేటుపరం చేయబోనని ప్రధాని మోదీ ప్రకటించాలని కోరుతూ నగరంలో అన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లో విధులకు హాజరైన ఉద్యోగులు, కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి, నిరసనలు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు సామూహికంగా విధులు బహిష్కరించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విశాఖ ఉక్కు కార్మికుల కుటుంబాలపై మధ్యాహ్నం రెండు గంటల నుంచి ప్రభుత్వం నిర్బంధాన్ని రెట్టింపు చేసింది. కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ జంక్షన్ వద్ద నిరసన దీక్ష చేస్తున్న మహిళలను విచక్షణారహితంగా అరెస్టు చేయడాన్ని వామపక్షాలు, ప్రజాసంఘాలు, విద్యార్థి, యువజన, ఉద్యోగ, కార్మిక, మహిళా సంఘాలు ముక్తకంఠంతో ఖండించాయి. అరెస్ట్ అయిన వారిలో ఉక్కు పరిరక్షణ పోరాట ఐక్యకార్యాచరణ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్య రామ్, కె.సత్యనారాయణరావు, రామకృష్ణ, వరహాల శ్రీనువాసురావు, డీవీ రమణారెడ్డి, నీరుకొండ రామచంద్రరావు, వైటీ దాస్, ఎం.రామారావు సహా కార్పొరేషన్‌లో సీపీఐ పక్షనేత ఏజే స్టాలిన్, మహిళా నేతలు 500 మంది వరకు ఉన్నారు.

మోదీ మెప్పు కోసం అరెస్టులా?

కుటుంబ సభ్యులతో దీక్షా శిబిరంలో శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న వారిని బలవంతంగా అరెస్టు చేయడం దుర్మార్గమని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించడంలోనూ కుట్ర కనిపిస్తోందని కార్మికనేతలు మండిపడ్డారు. మోదీకి ఎర్రతివాచీ పరిచి ప్రభుత్వరంగ సంస్థలన్నీ అమ్మడానికి జై కొడుతున్నారని విమర్శించారు. ఉదయం నుంచే విశాఖ జిల్లాలో అనేకమంది నాయకులను, కార్యకర్తలను అరెస్టు చేశారు. గృహ నిర్బంధం చేశారు. అయినా కార్మికులు తమ నిరసనలను ఎక్కడికక్కడ తెలియజేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపుతానని ప్రకటించకపోతే మోదీ ప్రభుత్వం, జగన్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేసినట్లేనని, ద్రోహులుగా చరిత్రలో మిగిలిపోతారని కార్మిక నేతలు మండిపడుతున్నారు. రాబోయే ఎన్నికల్లో వీరిద్దరికీ తగిన గుణపాఠం చెబుతామన్నారు. అరెస్టు చేసిన వారందరినీ బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర హక్కుల కోసం ఆంధ్ర యూనివర్సిటీలో జరిగే సభలో మోదీని సీఎం జగన్ నిలదీయాలని డిమాండ్ చేశారు. బీజేపీ తన రాజకీయ ప్రయోజనాల కోసం వైసీపీని వాడుకుంటుందని అన్నారు. మోదీని కలవడానికి జనసేన నేత పవన్ కల్యాణ్ వస్తున్నారని, ఆయన కూడా విశాఖ ఉక్కుపై మోదీని ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. నగరంలో వామపక్ష, ప్రజాసంఘాల నేతలను, కార్యకర్తలను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. కొంతమందిని అరెస్టు చేశారు. శుక్రవారం సాయంత్రం సీపీఐ అల్లిపురం కార్యాలయానికి చేరుకొని పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణీంద్ర తదితరులను అదుపులోకి తీసుకున్నారు.

ఏపీ ద్రోహి మోదీ

(మొదటిపేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వ పెద్దలతో కలిసి నడుస్తున్నారని, ప్రతిపక్ష పార్టీలన్నీ ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. ముఖ్యంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఈ విషయాన్ని అర్థం చేసుకోకుండా రోడ్ మ్యాప్ ఇవ్వాలని పదేపదే కోరడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికైనా పవన్ కల్యాణ్ ఒక్కసారి ఆలోచించాలన్నారు. సీఎం జగన్, వైసీపీ ఎంపీలు కేంద్రానికి పూర్తిగా సహకరిస్తున్నారని, మోదీ అండదండలు లేకుండా రాష్ట్రంలో జగన్ ఒక్కరోజు కూడా పాలన సాగించలేరన్నారు. వివేకానంద రెడ్డి హత్య జరిగి మూడేళ్లు గడుస్తున్నా పురోగతి లేదని, సీబీఐ అధికారులు ఏం చేస్తున్నారో చెప్పాలని నిలదీశారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడే ప్రత్యేక హోదా కోసం దిల్లీలో ధర్నా చేశారని, ఇప్పటికీ మోదీ రాష్ట్రానికి పదేపదే అన్యాయం చేస్తున్నా రాష్ట్రంలో సీనియర్ నాయకునిగా, ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉండి మాట్లాడకపోవడం సరికాదన్నారు. చంద్రబాబు కచ్చితంగా తన గళం వినిపించాలన్నారు. తాము చేసే నిరసనలకు టీడీపీ నేతలు కలిసిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళి, కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, కుమార్ రెడ్డి, రాధాకృష్ణ, నదియా, నగర కార్యదర్శి విశ్వనాథ్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సుబ్బ రామమ్మ, జిల్లా కార్యదర్శి నాగరాజు, నగర కార్యదర్శి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగాన్ని నిర్వీర్యం చేస్తున్న మోదీ: జల్లి విల్సన్, ఓబులేసు

మోదీ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ నిర్వీర్యం చేస్తున్నారని, దీనిలో భాగంగానే 2లక్షల కోట్ల విలువ చేసే విశాఖ స్టీల్ ప్లాంటును రూ.40వేల కోట్లకు అమ్మ చూస్తున్నారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి జల్లి విల్సన్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు విమర్శించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ అధ్వర్యాన విజయవాడలోని ధర్నాచౌక్ సెంటర్లో ధర్నా నిర్వహించారు. విజయవాడ నగర ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు, సీఐటీయూ సెంట్రల్ అధ్యక్షుడు దుర్గారావు అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో వారిద్దరూ మాట్లాడారు. 32 మంది బలిదానాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును అమ్మితే మోదీ ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. అభివృద్ధి పథకాల ప్రారంభానికి వస్తున్న ప్రధాని విశాఖ స్టీలును ప్రైవేటీకరించబోమని హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రత్యేకహోదా. ఉత్తరాంధ్ర ప్యాకేజీ, కడప స్టీల్ ప్లాంట్ సహా విభజన హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలచి మోదీకి చరమగీతం పాడతామని స్పష్టం చేశారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు అజయ్, రాష్ట్ర నాయకుడు సీహెచ్ బాబురావు మాట్లాడుతూ కార్పొరేట్లకు ప్రజాసంపదను దోచిపెట్టేందుకే ప్రభుత్వరంగాన్ని ప్రైవేటీకరిస్తున్నారని దుయ్యబట్టారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్ మాట్లాడుతూ రాష్ట్రానికి మోదీ చేసిన అన్యాయం, ద్రోహం వైసీపీ ప్రభుత్వానికి తెలియడం లేదా? ఆయనకు ఎందుకు ఘనస్వాగతం పలుకుతున్నారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతుసంఘం ప్రధానకార్యదర్శి కేవీవీ ప్రసాద్, మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవానీ, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర, ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు కె.ఆర్.ఆంజనేయులు, ఏఐటీయూసీ నగర కోశాధికారి కొండలరావు, వియ్యపు నాగేశ్వరరావు, సీహెచ్. రామచంద్ర, నాగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, దప్పుకొట్టు శ్రీను, హాకర్సు యూనియన్ నగర అధ్యక్షుడు కొట్టు రమణారావు, మానం ఏడుకొండలు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ డిప్యూటి కార్యదర్శి సీహెచ్‌వీ రమణ, ఎన్టీఆర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చీర్ల రామస్వామి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు, ఏఐవైఎఫ్ విజయవాడ నగర సహాయ కార్యదర్శి బెవర శ్రీను, ఐఎఫ్‌టీయూ రాష్ట్రనాయకుడు పోలారి, పంచదార్ల దుర్గాంబ, సీతారావమ్మ, భారతి, రాహేలమ్మ, పుష్ప, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏవీ రావు, ముఠా కార్మిక సంఘం నాయకుడు సీతారాములు, డీవైఎఫ్ఐ నాయకుడు రామన్న తదితరులు పాల్గొన్నారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకులు బుట్టి రాయప్ప వందన సమర్పణ చేశారు.

ఏలూరు జిల్లాలో

మోదీ రాష్ట్ర పర్యటనను నిరసిస్తూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. ఏలూరులో జరిగిన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు డేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం జిల్లాలో

రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిన ప్రధానికి రాష్ట్రంలో పర్యటించే నైతిక హక్కు లేదని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ పి.కామేశ్వరరావు అన్నారు. విజయనగరం జిల్లా ఎస్.కోట పట్టణం దేవీ జంక్షన్ వద్ద మోదీ రాకను నిరసిస్తూ సీపీఐ నియోజకవర్గ శ్రేణులు నల్లబ్యాడ్జీలు ధరించి రాస్తారోకో చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మద్ది కృష్ణ, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దేగల అప్పలరాజు, మండల కార్యదర్శి మోపాడ మధు, కార్యవర్గ సభ్యులు బొంతలకోటి శంకర్, మురళి, అశోక్, ఆటో, మోటారు, కళాసీల నాయకులు పాల్గొని...మోదీ, వైసీపీ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

రాజాంలో

ఏ ముఖం పెట్టుకుని మోదీ విశాఖపట్నం వస్తున్నారని విజయనగరం జిల్లా సీపీఐ కార్యదర్శి ఒమ్మి రమణ ప్రశ్నించారు. రాజాంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ (పాలకొండ రోడ్డు) కూడలి వద్ద జరిగిన రాస్తారోకోలో ఆయన ప్రసంగించారు. సహాయకార్యదర్శి సింగారపు కనకరాజు, ఆంధ్రప్రదేశ్ చెరకు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, సీపీఐ రాజాం నియోజకవర్గ సహాయ కార్యదర్శి ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్, ఎం.గంగా రావు, యండమూరి కృష్ణ, సింగారపు వరలక్ష్మి, యండమూరి సత్తమ్మ, జామి భారతి, బాడిస సత్యారావు పాల్గొన్నారు.

గుంటూరులో: మోదీ పర్యటనకు వ్యతిరేకంగా గుంటూరు శంకర్ విలాస్ సెంటర్‌లో శుక్రవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన మోదీ ఏ ముఖంతో విశాఖపట్నం వస్తున్నారని ప్రశ్నించారు. నష్టాల పేరుతో విశాఖ ఉక్కు పరిశ్రమను కారుచౌకగా విదేశీ పెట్టుబడుదారులకు అమ్మటం దారుణమని అన్నారు. విభజన చట్టంలోని హామీలు అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి లేదా అని నిలదీశారు. రాష్ట్రంలో ఉన్న ఏకైక ఉక్కు పరిశ్రమను నష్టాల పేరుతో విదేశీ కంపెనీలకు అమ్మటం సరైనది కాదని అన్నారు. ఇప్పటికైనా విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వం నిర్వహించాలని, స్టీల్ ప్లాంట్ నిర్వహణకు గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ హనుమంతురావు, సీఐటీయూ పశ్చిమ కమిటీ ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు ప్రసంగించారు. సీఐటీయూ తూర్పు కమిటీ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఆకిటి అరుణకుమార్ అధ్యక్షత వహించగా సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ నగర అధ్యక్షులు రావుల అంజిబాబు, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి, ఏఐటీయూసీ నాయకులు పుప్పాల సత్యనారాయణ, సీపీఐ నాయకులు జంగాల చైతన్య, బి.వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులు దుర్మార్గం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రధాని నరేంద్ర మోదీ విశాఖపట్నం పర్యటన సందర్భంగా విశాఖలో సీపీఐ, సీపీఎం, కార్మిక సంఘాల నాయకులను అరెస్టులు చేయడం దుర్మార్గమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ... విశాఖపట్నంలో ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, సీపీఐ, సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శులు ఎం.పైడిరాజు, గంగారం, ఉక్కు ఉద్యమ నేతలు ఆదినారాయణ, అయోధ్యరామ్ తదితరులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయటం దుర్మార్గమన్నారు. మోదీ రాష్ట్రానికి ఏం చేశారని కోట్లాది రూపాయల ప్రజాధనం వెచ్చించి... సీఎం జగన్ రెడ్ కార్పెట్ స్వాగతం చెబుతున్నారంటూ ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌కు తీరని ద్రోహం చేసిన మోదీకి ఊడిగం చేయడానికి జగన్‌కు సిగ్గుండాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు అడుగడుగునా అన్యాయం చేసిందని, తిరుపతి వెంకన్న సాక్షిగా రాష్ట్రానికి 10 ఏళ్ల పాటు ప్రత్యేక హోదా ఇస్తానని ఇచ్చిన హామీని మోదీ తప్పారన్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి ముంత మట్టి, చెంబుడు నీళ్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి మొండి చేయి చూపారని, విభజన చట్ట హామీలన్నీ ఆటకెక్కాయని ధ్వజమెత్తారు. మోదీకి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పి ఏపీలో అడుగు పెట్టాలని డిమాండ్ చేశారు. విశాఖ పర్యటనలో ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, విశాఖ రైల్వే జోన్‌పై ప్రధాని మాట్లాడాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిలిపేస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

అరెస్టులను ఖండించిన విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట సమితి

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న కార్మికులను విశాఖపట్నంలో పోలీసులు అరెస్టు చేయడాన్ని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట సమితి కన్వీనర్లు జి.ఓబులేసు, ఎంఏ గఫూర్ తీవ్రంగా ఖండించారు. ఈ అరెస్టులను వ్యతిరేకిస్తూ ఈనెల 12న అన్ని కార్మిక, ప్రజా సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడిగా నిరసనలకు దిగనున్నాయని తెలిపారు. అన్ని కార్మిక సంఘాలు ప్రజా సంఘాలతో సంఘటితమై అన్ని పట్టణాలు, పల్లెల్లో నిరసనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

రాజీవ్ హంతకులకు విముక్తి

(మొదటిపేజీ తరువాయి)

సంచలన తీర్పుతో రాజీవ్ గాంధీ హత్య కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న ఎస్ నళిని, జయకుమార్, ఆర్‌పీ రవిచంద్రన్, రాబర్ట్ పయస్, సుధేంద్ర రాజా, శ్రీధరన్‌లకు జైలు జీవితం నుంచి విముక్తి లభించింది. వీరంతా జైలులో సత్ప్రవర్తనతో ఉన్నట్లు, వేర్వేరు డిగ్రీలు సాధించినట్లు అత్యున్నత న్యాయస్థానం గుర్తించింది. ఈ దోషులను జైలు నుంచి విడుదల చేయాలని 2018 సెప్టెంబరు 9న తమిళనాడు రాష్ట్ర మంత్రివర్గం సిఫారసు చేసిందని, తమకు శిక్ష తగ్గించాలని ఆ రాష్ట్ర గవర్నర్‌కు దోషులు విజ్ఞప్తి చేశారని సుప్రీంకోర్టు తెలిపింది. మంత్రివర్గ అభిప్రాయానికి గవర్నర్ కట్టుబడి ఉండవలసి ఉంటుందని పేర్కొంది. నళిని ప్రస్తుతం పెరోల్‌పై ఉన్నారు. ఆమె పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు తోసిపుచ్చింది. అనంతరం ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 30 సంవత్సరాలకు పైగా జైలు శిక్ష అనుభవించిన ఏజీ పెరరివలన్‌ను విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించడంతో నళిని ఈ పిటిషన్ దాఖలు చేశారు.

ఆమోదయోగ్యం కాదు: కాంగ్రెస్

రాజీవ్ గాంధీ హత్య కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న దోషులందరినీ విడుదల చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై కాంగ్రెస్ అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ తీర్పు దురదృష్టకరమని, ఆమోదయోగ్యం కాదని తెలిపింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ శుక్రవారం మాట్లాడుతూ రాజీవ్ హత్య కేసులో మిగిలిన ఆరుగురు దోషులను విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆమోదయోగ్యం కాదన్నారు. ఈ తీర్పును కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా విమర్శిస్తోందని, ఇది విమర్శల నుంచి తప్పించుకోజాలని తీర్పు అని చెప్పారు. ఈ అంశంలో భారతీయ ఆత్మకు అనుగుణంగా సుప్రీంకోర్టు ప్రవర్తించకపోవడం చాలా దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. రాజీవ్ గాంధీ తమిళనాడులోని శ్రీపెరుంబుదూర్‌లో 1991 మే 21న హత్యకు గురైన సంగతి తెలిసిందే. లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం(ఎల్‌టీటీఈ) ఆత్మాహుతి బాంబర్ ఆయనను హత్య చేసింది. ఈ కేసులో ఆరుగురు దోషులు తమిళనాడు జైలులో శిక్ష అనుభవిస్తున్నారు.

23వేల ఇంజినీరింగ్ సీట్లు ఖాళీ

(మొదటిపేజీ తరువాయి)

ఇంజినీరింగ్ సీట్లు మిగిలాయి.

సీట్ల భర్తీ వివరాలు: కన్వీనర్ కోటా కింద మూడు విడతలుగా 250 కళాశాలల్లో 1,13,403 సీట్లు అందుబాటులో ఉంటే అందులో 25 ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో 6,618 సీట్లలో 5,111 భర్తీ అయ్యాయి. మరో 1,507 సీట్లు మిగిలాయి. 219 ఇంజినీరింగ్ కళాశాలల్లో 1,02,918 సీట్లకుగాను 81,411 సీట్లు భర్తీ కాగా, 21,507 సీట్లు ఉన్నాయి. ఆరు ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో 3,867 సీట్లకుగాను 3,578 సీట్లు భర్తీ అయ్యాయి. మరో 289 సీట్లు మిగిలిపోయాయి. మొత్తంగా 23,303 ఇంజినీరింగ్ సీట్లు భర్తీకి నోచుకోలేదు. అత్యధికంగా ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో 21,507 సీట్ల భర్తీ కాలేదు. మిగిలిన సీట్లలో అత్యధికంగా మెకానికల్, సివిల్ బ్రాంచీలవి ఉన్నాయి. యాజమాన్య కోట (కేటగిరి-ఏ)లో 30వేల సీట్లు మిగిలాయి. సకాలంలో కౌన్సెలింగ్ నిర్వహించకపోవడం, ప్రైవేట్ కళాశాలల్లో విద్యా ప్రమాణాలు సరిగ్గా లేకపోవడం వెరసి విద్యార్థులు ఆసక్తి చూపనట్లు తెలిసింది. రాష్ట్రానికి చెందిన 40వేల మంది ఇతర రాష్ట్రాలలోని ప్రైవేట్/డీమ్డ్ విశ్వవిద్యాలయాల్లో చేరారు.

14లోగా రిపోర్ట్ చేయాలి: కన్వీనర్ నాగరాణి

స్పెషల్ రౌండులో సీట్లు పొందిన అభ్యర్థులంతా ఈనెల 11-14 తేదీల్లోగా ఆయా ఇంజినీరింగ్ కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని ఏపీఈఏపీసెట్ కన్వీనర్ సి.నాగరాణి తెలిపారు. మూడు విడతలుగా కౌన్సెలింగ్ జరిగిందని, రౌండుకు కొత్తగా 331 మంది నమోదు చేసుకున్నారన్నారు. పాత, కొత్త అభ్యర్థులు కలిపి 24,142 మంది వెబ్ ఆప్షన్లు ఇవ్వగా, వారిలో తాజాగా 3,458 మందికి సీట్లు కేటాయించామని చెప్పారు. మరో 9,958 మంది స్లైడింగ్ అయినట్లు తెలిపారు. స్పెషల్ రౌండ్ సీట్ల కేటాయింపు పూర్తి వివరాలను ౦ఎ్పవ.ఖజూ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌లో పొందవచ్చునన్నారు.

పరిశ్రమల స్థాపనకు పూర్తి సహకారం

- గ్లోబల్ స్పైసెస్ ప్రాసెసింగ్ ఫెసిలిటీ యూనిట్ ప్రారంభోత్సవం
- చిలకలూరిపేట నియోజవర్గంలో 1500 మందికి ఉపాధి, 15 వేల మంది రైతులకు మేలు
- రూ.3,450 కోట్లతో ప్రతి జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు
- సీఎం జగన్‌మోహన్ రెడ్డి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: రాష్ట్రంలో పెట్టుబడి పెట్టే పారిశ్రామిక వేత్తలకు పూర్తి సహకారం అందజేస్తామని, వారికి ఏ సమస్య వచ్చినా ఒక్క ఫోన్ కాల్ ద్వారా వారి సమస్యలు పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం చిలకలూరిపేట నియోజకవర్గం యడ్లపాడు మండలం మైదవోలులో ఏర్పాటు చేసిన స్పైసెస్ పార్కులో ఐటీసీ అధ్వర్యంలో 6.2 ఎకరాల్లో 20 వేల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మించిన గ్లోబల్ స్పైసెస్ ప్రాసెసింగ్ ఫెసిలిటీ యూనిట్‌ను సీఎం ప్రారంభించారు. హెలికాప్టర్ ద్వారా ఇక్కడికి చేరుకున్న సీఎం జగన్‌కు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాంబు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాగేశ్వరరావు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవ రాయలు, ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. ముందుగా ఐటీసీలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించారు. ఐటీసీ తమ సేవలను, కార్యక్రమాలతో కూడిన వీడియోను ప్రదర్శించింది. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం సీఎం జగన్ మాట్లాడుతూ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో గత మూడేళ్లుగా ఏపీ ప్రథమ స్థానంలో నిలిచిందని, ఈ ఏడాది పారిశ్రామికవేత్తలను అడిగి ర్యాంకింగ్ ఇచ్చారని గుర్తుచేశారు. రూ.3,450 కోట్లతో ప్రతి జిల్లాలోనూ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు కానున్నాయని, 33 వేల మందికి ఉద్యోగాలు వస్తాయని వెల్లడించారు. వీటిని మొదటి దశ కింద రూ.1,250 కోట్లతో 10 యూనిట్లకు డిసెంబర్, జనవరి నెలల్లో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు రైతులకు వరంగా మారనున్నాయని వివరించారు. రెండో దశ పనుల కోసం ఐటీసీ కంపెనీకి ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో సహకారం అందుతుందని భరోసా ఇచ్చారు. పరిశ్రమల స్థాపనకు ఏపీ అన్ని రకాల సహకారాలు అందజేస్తోందని, అందువల్లనే అనేక పరిశ్రమలు ఏపీకి తరలివస్తున్నాయని వివరించారు. ఈ గ్లోబల్ స్పైసెస్ ప్రాసెసింగ్ ఫెసిలిటీ యూనిట్ రెండవ విడత పనులను కూడా ప్రారంభిస్తే ఆసియాలోనే మొదటి యూనిట్‌గా నిలుస్తుందన్నారు. ఈ యూనిట్ వల్ల 15 వేల మంది రైతులకు మేలు జరుగుతుందని, స్థానికంగా 1,500 మందికి ఉపాధి లభిస్తుందని, స్థానికంగా పండించే మిర్చి, పసుపు, సుగంధ ద్రవ్యాలకు మంచి ధర లభిస్తుందని తెలిపారు. మన రైతులను చేయిపట్టి నడిపించే బాధ్యత ఐటీసీ తీసుకుందని, రానున్న రోజుల్లో ఈ కంపెనీ రాష్ట్రంలో అనేక పరిశ్రమలను స్థాపించటానికి ముందుకు వచ్చిందని తెలిపారు. మంత్రి విడదల రజిని మాట్లాడుతూ చిలకలూరిపేట నియోజకవర్గంలో ఈ పరిశ్రమ వల్ల స్థానిక రైతులకు మేలు జరగటమే కాకుండా యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఐటీసీ కంపెనీ చైర్మన్ సంజీవ్‌పూరి మాట్లాడుతూ రాష్ట్రంలో భారీగా విస్తరణ కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. ఇప్పటికే రూ.140 కోట్లతో వెల్‌కమ్ పేరుతో గుంటూరులో ఫైవ్ స్టార్ హోటల్‌ను ఏర్పాటు చేశామని, ప్రభుత్వ సహకారంతోనే తమ వ్యాపారాన్ని విస్తరిస్తునట్లు చెప్పారు. కార్యక్రమంలో కంపెనీ సెక్రటరీ సతియన్, పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి, చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలో ప్లాటినం జూబ్లీ పైలాన్ ఆవిష్కరణ

గుంటూరు వైద్య కళాశాలను స్థాపించి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కళాశాల ఆవరణలో ప్లాటినం జూబ్లీ పైలాన్‌ను సీఎం జగన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి విడదల రజిని, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ శ్యాంసుందర్, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు మేకతోటి సుచరిత, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, కిలారి వెంకటరోశయ్య, మహమ్మద్ ముస్తఫా, మద్దాళి గిరిధర్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి దేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మావతి దేవి... గత మూడు సంవత్సరాలు వైద్య కళాశాల చరిత్రలోనే గోల్డెన్ పీరియడ్ అని, కళాశాలలో అన్ని కేడర్లు ప్రమోషన్లు, ఖాళీల భర్తీతో పాటు నూతన విభాగాలను ఏర్పాటు చేసి 32 పీజీ సీట్లు, 8 సూపర్ స్పెషాలిటీ సీట్లు పెంచినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఏపీ జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు 'ది ఫాదర్స్ హెల్తీ విజన్ అండ్ ది సన్స్ గ్లోరిస్ మిషన్' నినాదంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రాలతో కూడిన ప్ల కార్డులు ప్రదర్శించారు. జూనియర్ డాక్టర్ల స్టైఫండ్ పెంచినందుకు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఉమాజ్యోతి, చంద్రకళ, జడ్పీ సీఈఓ శ్రీనివాసరెడ్డి, గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విశాలాంధ్ర పుస్తక మహోత్సవం

విశాలాంధ్ర - విశాఖ: విశాలాంధ్ర 21వ విశాఖ పుస్తక మహోత్సవాన్ని ఈనెల13 (ఆదివారం) నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు టర్నర్ చౌల్ట్రీలో నిర్వహించనున్నట్లు విశాలాంధ్ర బుక్‌హౌస్ మేనేజర్ పీపి రాజు తెలిపారు. పుస్తక మహోత్సవాన్ని మంత్రి గుడివాడ అమర్నాథ్ ప్రారంభిస్తారని, ముఖ్యఅతిథిగా జీవీఎంసీ కమిషనర్ ఎ.రాజబాబు, అధ్యక్షులుగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, అతిథులుగా కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.మైథిలి, హిందూ ప్రిన్సిపల్ కరస్పాండెంట్ సుమిత్ భట్టాచార్జి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ టి.మనోహర్ నాయుడు హాజరువుతారని చెప్పారు. 40 మంది ప్రచురణకర్తలు ముద్రించిన 20వేల పుస్తకాలు అందుబాటులో ఉంటాయని శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాజు తెలిపారు. అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజు మాట్లాడుతూ పుస్తక మహోత్సవం సందర్భంగా సాహిత్య ప్రియుల కోసం శని, ఆదివారాల్లో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. విశాలాంధ్ర బ్యూరో పి. రామకృష్ణ మాట్లాడుతూ అభ్యుదయ, ప్రగతిశీల, సాహిత్యాన్ని అందించి ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని కల్పించడమే లక్ష్యంగా విశాలాంధ్ర విజ్ఞాన సమితి 1952లో విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ స్థాపించిందన్నారు. సాహిత్యాన్ని మారుమూల గ్రామాలు, గిరిజన ప్రాంతాల ప్రజలకు అందించడం కోసం సంచార పుస్తక ప్రదర్శన పేరుతో విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన బస్సులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన అంటే పుస్తక ప్రియులకు పండగు అని, విశాలాంధ్ర బుక్‌హౌస్ వైఎస్ఆర్ జీవత సాఫల్య పురస్కారాన్ని అందుకోవడం గర్వకారణమని రామకృష్ణ అన్నారు.

అదానీ కోసమే విశాఖ రైల్వేస్టేషన్ ఆధునీకరణ

చలసాని శ్రీనివాస్

విశాలాంధ్రబ్యూరో-విశాఖపట్నం: అదానీకి అమ్మడానికే విశాఖ రైల్వేస్టేషన్ ను కేంద్రప్రభుత్వం ఆధునీకరిస్తోందని విభజన హామీల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ విమర్శించారు. శుక్రవారం ఉదయం విశాఖపట్నం ప్రెస్‌క్లబ్ లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ప్రధాని రాకను తాము వ్యతిరేకించడం లేదని, కేవలం ఏపీకి ఇచ్చిన విభజన హామీలను అమలు చేయడం లేదనే మోదీ వైఖరిని నిరసిస్తున్నామన్నారు. రైల్వేజోన్ ఇవ్వడం వీలు కాదని, విశాఖలో డివిజన్ ఎత్తేసి, కేకే లైన్‌ను ఒడిశాలో కలపడాలని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. తెలుగువారి ఆస్తులను గుజరాత్ కు చెందిన అదానికి ధారబోయడానికే మోదీ రాష్ట్రానికి వస్తున్నారని, రాష్ట్రానికి ఇంత అన్యాయం చేస్తున్నా... ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మోదీని నెత్తిన పెట్టుకొని ఎందుకు తిరుగుతున్నారో రాష్ట్ర ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. సాధన సమితి కన్వీనర్, సీపీఐ ఫ్లోర్ లీడర్ ఏజే స్టాలిన్ మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం... విభజన హామీలను అమలు చేయకుండా ఆంధ్ర రాష్ట్ర ప్రజలను మోసగిస్తోందని మండిపడ్డారు. విశాఖలో పరిశ్రమలను అమ్మడానికే మోదీ విశాఖ వస్తున్నారని, ఇచ్చిన హామీలపై మోదీ సభలో సమాధానం చెప్పాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయబోమని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ జీఎన్ నాయుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్కే ఎస్‌వీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

25న పార్లమెంట్ మార్చ్

ఉద్యోగాల భర్తీ కోసమే: లెనిన్ బాబు

విశాలాంధ్ర-నంద్యాల: ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలన్న డిమాండుతో ఈనెల 25న పార్లమెంట్ మార్చ్ నిర్వహించనున్నట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.లెనిన్‌బాబు తెలిపారు. దేశంలో భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టం అమలు చేసి అన్ని శాఖల్లో ఖాళీలు భర్తీ చేయాలని, విభజన హామీల్లో భాగంగా రాష్ట్రానికి ఇవ్వవలసిన 10జాతీయ విశ్వవిద్యాలయాల తక్షణ ఏర్పాటునకు నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చలో ఢిల్లీకి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విద్యార్థులు, నిరుద్యోగులను కోరారు. సీపీఐ నంద్యాల జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో లెనిన్ బాబు మాట్లాడారు. విద్యా కాషాయకరణ, ప్రైవేటీకరణకు కుట్రలో భాగంగానే జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చి విద్యార్థులకు మతోన్మాదాన్ని నూరిపోసే ప్రయత్నాన్ని మోదీ ప్రభుత్వం చేస్తోందన్నారు. చిలక పంచాంగం, జ్యోతిష్యం, పురాణాలు, పురో హితం, స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను వక్రీక రించి, దేశద్రోహుల చరిత్ర అంటూ పాఠ్యాంశాల ద్వారా విద్యార్థులకు మతోన్మాదాన్ని నూరిపోస్తోం దన్నారు. ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు ఇవ్వక పోవడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శులు ధనుంజయుడు, నాగరాముడు, సహాయ కార్యదర్శులు ఎర్రిస్వామి, విష్ణు, నాయకులు ఉదయ్, చరణ్, వెంకట్, రామంజి పాల్గొన్నారు.

26న రైతుల నిరసన.. గవర్నర్‌కు మెమోరాండం

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి తీర్మానం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): రైతుల సమస్యల పైన, వ్యవసాయ చట్టాల రద్దు సమయంలో కమిటీ వేస్తామని చెప్పిన కేంద్రం, తాత్సారం చేయడంపైన సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 26న విజయవాడ ధర్నాచౌక్‌లో నిరసనలతోపాటు, గవర్నర్‌కు మెమోరాండం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి తీర్మానం చేసింది. అదేరోజు ఈ ధర్నాలు దేశావ్యాప్తంగా జరగనున్నాయి. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆల్ ఇండియా కిసాన్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వై కేశవరావు అధ్వర్యంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఝాన్సీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వ్యవసాయ చట్టాల రద్దు సమయంలో ఇచ్చిన హామీలను మోదీ ప్రభుత్వం అమలు చేయకుండా మోసగించిందని కేశవరావు అన్నారు. మళ్లీ అవే చట్టాలను ప్రవేశ పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రైతు నాయకుడు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ ఖరీఫ్ కోతలు ప్రారంభం అయ్యాయని, రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొంటామంటున్న ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదని తెలిపారు. ధాన్యం కొన్న 21 రోజుల్లో రైతులకు డబ్బు చెల్లించాలని, లేనిపక్షంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ మోటార్లకు మీటర్లు బిగించడాన్ని 11 రాష్ట్రాలు వ్యతిరేకించాయని, అందులో బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలూ ఉన్నాయన్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే తలొగ్గి స్మార్ట్ మీటర్లు బిగించేందుకు పూనుకున్నదని, దీనికి సంబంధించి 2020 సెప్టెంబరులో జీఓ కూడా విడుదల చేసిందన్నారు. అదానీ, అంబానీ వంటి బడా కంపెనీల ప్రయోజనం కోసం నగదు బదిలీ పేరుతో ఉచిత విద్యుత్ పథకాన్ని ఎత్తివేయాలని బీజేపీ కుట్ర చేస్తోందన్నారు. ఈ సమావేశంలో ఏపీ రైతు సంఘం కార్యదర్శి మల్నీడి యల్లమందరావు, రాష్ట్ర సామాజిక వన రైతు సంఘం కార్యదర్శి వీ హనుమారెడ్డి, రైతు సంఘం గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి శివా, గుంటూరు, కృష్ణాజిల్లా రైతు సంఘం నాయకులు ముక్కావుల ఉమామహేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా రైతు సంఘం నాయకులు సీహెచ్ సుబ్బారావు, యెర్నేని నాగేంద్రనాథ్, హెచ్.సురేంద్రనాథ్ బెనర్జీ, డీ హరనాథ్, ఆర్ కృష్ణయ్య, జెట్టి గురునాథరావు, ఐనబత్తుల ఉమామహేశ్వరరావు, ఇతర రైతు నాయకులు పాల్గొన్నారు.

'పెన్‌డ్రైవ్' పుస్తకం ఆవిష్కరించిన సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జర్నలిస్ట్ రెహాన రచించిన సమకాలీన రాజకీయ పరిశీలనా వ్యాసాల సంకలనం 'పెన్ డ్రైవ్' పుస్తకాన్ని తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ ఆవిష్కరించారు. వివిధ సందర్భాల్లో రాసిన వ్యాసాలను పుస్తక రూపంలోకి తీసుకురావడం పై రెహానాను సీఎం అభినందించారు. ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామ కృష్ణారెడ్డి, జీవీడీ కృష్ణమోహన్, సీఎం సీపీఆర్వో పూడి శ్రీహరి పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి

- గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్
- ఘనంగా మహిళా వర్సిటీ స్నాతకోత్సవం
- 1902 మందికి డిగ్రీలు ప్రధానం
- ప్రఖ్యాత శాస్త్రీయ నృత్యకారిణి పద్మజా రెడ్డికి గౌరవ డాక్టరేట్

విశాలాంధ్ర-తిరుపతి ఎస్వీయూ: మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి సాధ్యమని, అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్ అన్నారు. తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం 19, 20వ స్నాతకోత్సవాలను శుక్రవారం వర్సిటీలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో నిర్వహించారు. బిశ్వభూషణ్ కులపతి హోదాలో హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, ప్రపంచంలోని అతిపెద్ద ఉన్నత విద్యావ్యవస్థల్లో భారత్‌ది రెండవ స్థానమని అన్నారు. అత్యాధునిక పరిజ్ఞానం, నైపుణ్యం కలిగిన మానవశక్తిని అందించడం విశ్వవిద్యాలయాల లక్ష్యం కావాలని సూచించారు. విద్య, పరిశోధనా రంగంలో జాతీయ, అంతర్జాతీయస్థాయి గుర్తింపును మహిళా వర్సిటీ సాధించిందని ఆకాంక్షించారు. డిగ్రీలు పొందిన విద్యార్థులు దేశ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వర్సిటీ ప్రగతి నివేదికను ఉపకులపతి ఆచార్య దువ్వూరు జమున చదివి వినిపించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణా జిల్లాకు చెందిన ప్రఖ్యాత శాస్త్రీయ నృత్యకారిణి, పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం పద్మజారెడ్డికి స్నాతకోత్సవంలో భాగంగా గౌరవ డాక్టరేట్ అందజేశారు. 2020, 2021 విద్యా సంవత్సరాలలో యూజీ, పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ కోర్సులు చేసిన 1,902 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ఇందులో 988 మంది ఇన్ పర్సన్, 610 మంది ఇన్ ఆబ్సెన్సియా, 304 మంది ఇన్ అడ్వాన్సు డిగ్రీలు అందుకున్నారు. మ్యూజిక్ అండ్ డాన్స్ విభాగంలో పీహెచ్‌డీ చేసిన ఎస్ఆర్ఐ ఆముక్తమాల్యద సుష్మాకు డాక్టరేట్ అందజేశారు. 108 మందికి బంగారు పతకాలు, 23 మందికి బుక్‌ప్రైజ్, ఐదుగురికి నగదు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డీఎం మమత, గవర్నర్‌కు ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా, డీన్లు, పరీక్షల నియంత్రణాధికారి కొలకలూరి మధుజ్యోతి, అధ్యాపకులు, పీఆర్ఓ డాక్టర్ శ్రీరజని పాల్గొన్నారు.

పాలకవర్గాల కుట్రలను తిప్పికొట్టండి

గణేశ్ పేరుతో లేఖలో పిలుపు

విశాలాంధ్ర - జిమాడుగుల (అల్లూరి జిల్లా): అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన జరిగి ఎనిమిదిన్నరేళ్లు గడిచినా పార్లమెంటు సాక్షిగా '2013-రాష్ట్ర విభజన చట్టం'లో ఇచ్చిన హామీలలో చాలా వరకు అమలు కాలేదని, విభజన చట్టంలోని హామీల కోసం ఉద్యమించాలని, పాలకవర్గాల కుట్రలను తిప్పికొట్టాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఆంధ్రా-ఒడిశా సరిహద్దు కార్యదర్శి గణేశ్ పేరుతో లేఖ విడుదల అయింది. విడిపోయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాజధాని నిర్మాణం, కృష్ణ, గోదావరి, తుంగభద్ర నదీజలాలను రెండు రాష్ట్రాల మధ్య పంపిణీ, పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి కేంద్రమే నిర్మించడం, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ వంటివి అమలు చేయాలని లేఖలో పేర్కొన్నారు. '2014లో విభక్త ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికలలో టీడీపీ గెలవడంతో చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటు అయింది. రాజధాని, పోలవరం నిర్మాణం రెండు నా రెండు కళ్లు' అని ఆయన ప్రకటించారు. అమరావతిని రాజధానిగా ప్రకటించి దాని చుట్టుపక్కల గ్రామాలలో రైతులు సాగు చేసుకుంటున్న 32వేల ఎకరాల భూములను సేకరించి, ఇన్సైడెడ్ ట్రేడింగ్‌కు పాల్పడి, తన అశ్రితులకు ఆ భూములను కట్టబెట్టి, రియల్ ఎస్టేట్ వ్యాపారానికి పూనుకున్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వంతో అవకాశవాద రాజీ వైఖరిని ప్రదర్శించి, రాష్ట్రప్రయోజనాలను తాకట్టుపెట్టి, విభజన చట్టంలోని హామీల అమలుకు కేంద్రంపై పోరాడలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్ఆర్సీపీ నేత జగన్... పాలనా వికేంద్రీకరణ ద్వారానే అభివృద్ధి వికేంద్రీకరణ జరుగుతుందనీ, మూడు రాజధానుల నిర్ణయం చేసి, మూడున్నరేళ్లుగా ఎక్కడా రాజధాని నిర్మించకుండా, మూడు ప్రాంతాల ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించి కాలం గడుపుతున్నారు.

రేపటి నుంచి జగనన్న కాలనీల పరిశీలన

జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివశంకరరావు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న కాలనీలో పరిస్థితి, పురోగతి, అవకతవకలు, మోసాలపై ప్రతి నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు నివేదిక ఇవ్వనున్నట్టు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ శివశంకరరావు తెలి పారు. శుక్రవారం విశాఖపట్నం ప్రెస్ క్లబ్‌లో జనసేన నేతలు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. లబ్ధిదారుల కేటాయింపులో పారదర్శకత లేదని, పక్షపాత ధోరణితో ఆ పార్టీ సభ్యులకు మాత్రమే కాలనీల్లో ఇళ్లు కేటాయించారని ఆయన ఆరోపించారు. కాలనీల నిర్మాణం కోసం భూసేకరణలో రూ.40 వేల కోట్ల మౌలిక సదుపాయాల కోసం రూ.20 వేల కోట్లు కేటాయించినట్టు పేర్కొన్నారు. వారు గొప్పలు చెప్పుకోవడం తప్ప, క్షేత్రస్థాయిలో పని జరగలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రధానమంత్రి ఆవాసయోజన కింద రూ.1.80 లక్షలు మాత్రమే లబ్ధిదారులకిచ్చి రాష్ట్రప్రభుత్వం ఉచితంగా ఇసుక సరఫరా చేస్తోందన్నారు. మరో ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 28 లక్షల ఇళు కట్టిస్తామని హామీ ఇచ్చి, ఇప్పటికి 1.52 లక్షల ఇళ్లు మాత్రమే నిర్మించిందన్నారు. ఈనెల 13, 14, 15 తేదీల్లో పవన్ రాష్ట్రంలోని ఏదో ఒక నియోజకవర్గానికి వెళ్లి జగనన్న కాలనీల క్షేత్రస్థాయి పరిశీలన చేస్తారని తెలిపారు. పీఏసీ సభ్యుడు తాతారావు మాట్లాడుతూ 68,527 ఎకరాల్లో ఇళ్లు నిర్మిస్తానని హామీ ఇచ్చి, ఇప్పటివరకు ఒక్క ఎకరంలో కూడా ఇళ్లు నిర్మించలేదన్నారు. 22 వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్, రాష్ట్ర కార్యదర్శి గడసాల అప్పారావు, ఉత్తర నియోజకవర్గ ఇన్చార్జ్ పసుపులేటి ఉషాకిరణ్, సీనియర్ నాయకులు శంకు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'ఉక్కు' కార్మికుల అరెస్టు దుర్మార్గం: శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయవద్దని 638 రోజులుగా నిరసన చేస్తున్న దీక్షా శిబిరంలోని కార్మికులను, నాయకులను మోదీ మెహర్బానీ కోసం అరెస్టు చేయడం దుర్మార్గమంటూ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఇది తెలుగు ప్రజలను అవమానించడమేనని, అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రభుత్వం అసెంబ్లీ తీర్మానం చేసిందనీ గుర్తుచేశారు. బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు, సంస్థలు, వ్యక్తులు ఆందోళన చేస్తున్నాయని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం మాత్రం ఒకవైపు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వద్దంటూనే మరోవైపు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ప్రసన్నం చేసుకోవడానికి అరెస్టులు చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై చిత్త శుద్ధితో వ్యవహరించాలని, అరెస్టు చేసినవారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నిబద్ధతకు చిహ్నం వరదాచారి, కేఎల్ రెడ్డి

ఏపీయూడబ్ల్యూజే సంతాప సభలో ఐజేయూ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : జర్నలిజం వృత్తికి వన్నె తెచ్చిన వరదాచారి, కేఎల్ రెడ్డి నిబద్ధతకు మారుపేరని ఐజేయూ అధ్యక్షులు కె.శ్రీనివాసరెడ్డి కొనియాడారు. ఈనెల 3న కొద్దిగంటల తేడాతో ఒకేరోజు మృతి చెందిన సీనియర్ జర్నలిస్టులు వరదాచారి, కేఎల్ రెడ్డి మృతికి నివాళులర్పిస్తూ ఏపీయూడబ్ల్యూజే అధ్వర్యంలో శుక్రవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సంస్మరణ సభ నిర్వహించారు. ఈసందర్భంగా వారి చిత్రపటాలకు ఐజేయూ అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీనియర్ జర్నలిస్టు కె.ఎల్.రెడ్డి (93) ఈనెల 3వ తేదీ తెల్లవారుజామున వరంగల్లులో కన్నుమూయగా, మరో ప్రముఖ సంపాదకుడు జి.ఎస్.వరదాచారి (92) అదేరోజు మధ్యాహ్నం దివంగతులయ్యారని, ఈ విధంగా ఒకేరోజు తెలుగు పత్రికారంగం ఇద్దరు పాత్రికేయ దిగ్గజాలను కోల్పోయిందన్నారు. వరదాచారి వేర్వేరు పత్రికల్లో వివిధ హోదాల్లో పనిచేయడంతో పాటు తెలుగు విశ్వవిద్యాలయంతో పాటు అనేక విశ్వవిద్యాలయాలలో జర్నలిజంపై బోధనలు చేశారని తెలిపారు. మరోపక్క ఏపీయూడబ్ల్యూజే యూనియన్ ప్రధానకార్యదర్శిగా, అధ్యక్షులుగా పనిచేసి అనేక జర్నలిస్టు సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేశారని కొనియాడారు. పదవీ విరమణ తర్వాత కూడా వయోధిక పాత్రికేయ సంఘ వ్యవస్థాపక అధ్యక్షునిగా రిటైర్డు జర్నలిస్టుల సంక్షేమానికి విశేష సేవలందించారని తెలిపారు. ఇక కె.ఎల్.రెడ్డి వివిధ దిన పత్రికల్లో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వహించి తనదైన ముద్ర వేశారని, చెప్పదల్చుకున్న అంశాన్ని అవతలివారు ఎవరైనా సరే నిర్భయంగా, నిర్మోహమాటంగా చెప్పేవారన్నారు. ఆయన అనారోగ్యంగా ఉన్న విషయాన్ని తెలుసుకొని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ పరామర్శించి, ఆయన జీవనభృతికి ఇబ్బంది లేకుండా రూ.15 లక్షలు డిపాజిట్ చేయిస్తానని చెప్పగా, దానిపై కె.ఎల్.రెడ్డి తన జీవన భృతికి ఆ డిపాజిట్ పై వచ్చే వడ్డీ చాలునని, తాను చనిపోయిన తర్వాత 15 లక్షలు ప్రభుత్వానికి జమ చేసేలా చర్యలు తీసుకోవాలని సీఎంకు సూచించారని తెలిపారు. దీనినిబట్టి ఆయన నిజాయితీ, ముక్కుసూటితనం, నిబద్ధత ఏమిటో తేటతెల్ల మవుతోందన్నారు. వారిద్దరి మరణం తెలుగు పాత్రికేయ రంగానికి, ఏపీయూడబ్ల్యూజేకు తీరనిలోటని శ్రీనివాసరెడ్డి పేర్కొంటూ, వారి మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షులు ఐ.వి.సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐజేయూ ఉపాధ్యక్షులు అంబటి ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులు డి.సోమసుందర్, ఆలపాటి సురేష్‌కుమార్, ఏపీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి చందూ జనార్ధన్, మాజీ అధ్యక్షులు గారపాటి ఉపేంద్రబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చావా రవి, అచ్యుతరావు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నిమ్మరాజు చలపతిరావు, ఐజేయూ సభ్యులు షేక్ బాబు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దారం వెంకటేశ్వరరావు, దాసరి నాగరాజు, సాంబశివరావు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

సంపాదకీయం

బీజేపీ, ఆప్ వాగ్దానాల జడి

ఇచ్చిన హామీలను, చేసిన వాగ్దానాలను నెరవేర్చే అలవాటు లేని బీజేపీ ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఎలాగైనా గెలవడమే లక్ష్యంగా పెట్టుకున్నది. 2014 నుంచి బీజేపీ నాయకత్వంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఎన్నికల ప్రచారంలో వందలాది వాగ్దానాలను మోదీ గుప్పించారు. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హామీ ఇస్తామని పదేపదే చేసిన వాగ్దానాన్ని తుంగలోతొక్కి రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేశారు. ఒకవైపు ఉచితాలను పంపిణీ చేస్తూనే ఉచితాలు వద్దంటారు మోదీ. సుదీర్ఘకాలంగా ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్‌ను పాలిస్తున్న బీజేపీ సకల విషయాలలోనూ వైఫల్యాన్ని మూటకట్టుకుంది. అయినప్పటికీ అనేక మాయోపాయాలు, ఎత్తుగడలు వేసి గెలవడమే ముఖ్యమని బీజేపీ భావిస్తోంది. దేశంలోగానీ, బీజేపీ పాలిత రాష్ట్రాలలోనూ సుపరిపాలన అందించలేని ఢిల్లీలో సుపరిపాలన అందిస్తానని, ప్రతి ఇంటికి మంచినీటి పంపులు వేయిస్తానని, మురికివాడల్లో నివసించేవారికి ఇళ్లు కట్టిస్తానని, తదితర వాగ్దానాలు చేసింది. ఢిల్లీలోని అనేక ప్రాంతాల్లో పేదల ఇళ్లను కూల్చివేసి, ప్రత్యేకంగా మైనారిటీవర్గ ప్రజలపై కక్షగట్టి దాడులు చేయించారన్న విమర్శలను ఎదుర్కొన్న బీజేపీ ఇళ్లు కట్టిస్తానని చెప్తే నగర ప్రజలు విశ్వసించే అవకాశాలు తక్కువే. ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) నేత అరవింద్ కేజ్రీవాల్ ముఖ్యమంత్రిగా ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం చాలా అంశాల్లో ప్రజానుకూలపాలన అందిస్తోందని పేరు తెచ్చుకుంది. గత 15ఏళ్లుగా ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌ను పాలిస్తున్న బీజేపీని ఓడించి ఆప్ గెలవడానికి కేజ్రీవాల్ కూడా అనేక వాగ్దానాలు చేశారు. ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యం, విద్య విషయాలలో మంచిపేరు తెచ్చుకుంది. వైద్య సేవలు, స్కూలు విద్యను అందించడంలో, మంచి నీరు, విద్యుత్‌ను సబ్సిడీపైన సరఫరా చేస్తూ ప్రజల ఆదరణ పొందింది. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ, ఆప్ మధ్య తీవ్రపోటీ జరగనుంది. ఆప్ ఈ సారి పది వాగ్దానాలు చేసింది. కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపొందితే ఢిల్లీ రాష్ట్రాన్ని పాలిస్తున్న ఆప్ కార్పోరేషన్‌ను కూడా సమర్థంగా పాలించే అవకాశాలుంటాయి.

ఢిల్లీ నగరం అమితమైన వాయుకాలుష్యంతో తల్లడిల్లుతోంది. కాలుష్యం బారినపడి ప్రజలు అనేకరకాల అనారోగ్యాలకు లోనవుతున్నారు. శీతాకాలం వచ్చిందంటే ప్రజల అవస్థలు వర్ణనాతీతం. ముఖ్యంగా శ్వాసకోశ వ్యాధులు పెరుగుతున్నాయి. కాలుష్యం ఎక్కువగా ఉన్న రోజుల్లో స్కూళ్లకు సెలవలిస్తున్నారు. నీరు, వాయుకాలుష్యం తగ్గింపు బాధ్యత ప్రధానంగా మున్సిపల్ కార్పొరేషన్‌పైన ఉంటుంది. నగరమంతటా చెత్తా చెదారం గుట్టలుగా ఏర్పడటానికి కార్పొరేషనే కారణం. కాలుష్యం తగ్గింపు బాధ్యతను బీజేపీ ఎటువంటి పరిస్థితుల్లోనూ తీసుకోదు. ఆ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వంపైకి నెడుతుంది. ఇక కేంద్ర ప్రభుత్వం సైతం తమాషా చూస్తూ కేవలం కేజ్రీవాల్‌నే నిందిస్తుంది.

ఇప్పుడు గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలు, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలూ రోజుల తేడాతో నిర్వహించాలని, కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్లు నిర్ణయించాయి. ఎన్నికల షెడ్యూలు సైతం పాలకులకు అనుకూలంగానే విడుదలవుతున్న విషయం దేశ ప్రజలందరికీ తెలిసిందే. కేజ్రీవాల్‌ను ఢిల్లీకీ పరిమితంచేసి గుజరాత్‌పై దృష్టిపెట్టకుండా చేయాలన్నదే బీజేపీ వ్యూహం. అంతేకాదు ఢిల్లీ ఉపముఖ్యమంత్రి సిసోడియాపై లిక్కర్ స్కామ్ కేసు బనాయించడం, కేజ్రీవాల్ విదేశాల నుంచి నిధులు పొందుతున్నారన్న అభియోగాలనుమోపి వీరిరువురినీ అప్రతిష్ఠపాలుచేస్తే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో గెలవవచ్చునన్న వ్యూహం బీజేపీది. ఇలాంటి మాయోపాయాలు పన్నడంలో బీజేపీ అగ్రనేతలు మహాదిట్టలు. కార్పొరేషన్ వార్డుల సరిహద్దులను నిర్ణయించడంలోనూ బీజేపీ దళితులు, మైనారిటీల ప్రాధాన్యతను తగ్గించడానికి పాలకపార్టీ కుట్రపన్నిందన్న ఆరోపణలకు రుజువులున్నాయని వార్డులను పరిశీలించినవారు చెప్తున్నారు. కశ్మీరులోనూ ఇలాంటి కుట్రపన్నారన్న విషయం దేశమంతటా గగ్గోలెత్తింది. ఇక అవసరమైనంతమంది సంఘపరివార్ కార్యకర్తలను సమీకరించడం, అపారంగా నిధులు ఖర్చుచేసి నాయకులను, ఓటర్లను ప్రభావితం చేయడం బీజేపీకి వెన్నతో పెట్టిన విద్య.

గతంలో 250 వార్డులుండగా కొత్తగా సరిహద్దులను పాలకపార్టీకి అనుకూలంగా మార్చిన తర్వాత 272 వార్డులయ్యాయి. 42 వార్డులను షెడ్యూల్డు కులాలకు రిజర్వు చేశారు. దళితులు, ముస్లింలు కొన్ని వార్డులలో అత్యధికంగా లేకుండా వారిని విభజించడానికే కొత్తగా సరిహద్దులను నిర్ణయించి వార్డులను పెంచారు. 2012 ఎన్నికల్లో 138 వార్డుల్లో గెలిచిన బీజేపీ 2017 నాటికి గెలుపు సంఖ్యను 181కి పెంచుకోగలిగింది. 2017లో ఆప్ 49 సీట్లలో గెలుపొంది రెండో స్థానంలో నిలువగా కాంగ్రెస్ 31 సీట్లు గెలిచి మూడవ స్థానానికి దిగజారింది. ఆప్ గత ఐదేళ్లలో గణనీయంగా తన బలాన్ని పెంచుకుంది.

15ఏళ్ల కాలం పాలించిన బీజేపీ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొనిఉన్న విశ్లేషణల నేపథ్యంలో పాలకపార్టీ కేంద్ర నాయకులు సైతం ఈ ఎన్నికలపై దృష్టి పెట్టారు. కార్పొరేషన్ ఎన్నికల్లో గెలవపోతే దాని ప్రభావం 2023లో జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలపైన, 2024 లోక్‌సభ ఎన్నికలపైన, తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని బీజేపీ ఆందోళన చెందుతోంది. దేశ రాజధాని ఢిల్లీ నగరాన్ని సక్రమంగా పాలించలేని వాళ్లు ఆ రాష్ట్రాన్ని, దేశాన్ని ఎలా పాలించగలరన్న విమర్శలను, దేశ ప్రజల వ్యతిరేకతను ఎదుర్కోవలసి వస్తుంది. బీజేపీ, ఆప్‌లు విజయం ధీమాతో ఉన్నాయి. ఆప్ గెలిస్తే ఆ పార్టీ ప్రభావం విస్తరించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కేజ్రీవాల్ అధికారానికి వచ్చి తొలినాళ్లలో అనుసరించిన దుందుడుకు పద్ధతిని వదిలిపెట్టి తానూ హిందూత్వవాదినే అని చెప్పి ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నారు. హిందువుల ఓట్ల కోసమే బీజేపీ అనుసరిస్తున్న కొన్ని విధానాలనూ కేజ్రీవాల్ కూడా అమలు చేస్తున్నారు. ఒకవేళ ఆప్ ఓడిపోతే ఢిల్లీ రాష్ట్రం ప్రభుత్వంపైనే ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని బీజేపీ ప్రచారం చేస్తారు. రెండు పార్టీల్లోనూ బీజేపీలోనే ఎక్కువ ఆందోళన కనిపిస్తోంది. ఢిల్లీలో బీజేపీ సాగించిన దమనకాండ పెరుగుతున్న ధరలు, నిరుద్యోగ సమస్య తదితరాలు నగర ప్రజలు గమనించకుండా ఓట్లు వేస్తే, ప్రస్తుత ప్రజాకంటక పాలనే మళ్లీ అవతరిస్తుంది.

నిస్తేజ స్థితిని పౌరసమాజం అధిగమించాలి

డా. ముచ్చుకోట సురేష్‌బాబు

ప్రజలు అందించిన అధికారాన్ని స్వప్రయోజనాలకు వాడుకుంటూ ప్రజాసమస్యలను నిర్లక్ష్యంచేస్తే వారిపై గొంతెత్తాల్సిన బాధ్యత పౌర సమాజంపై ఉంది. పౌర సమాజం అంటే ప్రజలే. స్వాతంత్ర్యం ముందు నుంచీ పౌర సమాజం తన బాధ్యతను నిర్వర్తిస్తోంది. ప్రజలందరూ ప్రగతిశీల దృక్పథం వైపు మళ్లేలా చేయడం ప్రధాన లక్ష్యంగా పౌర సమాజం పని చేయాలి. రాజ్యాంగం పౌరులందరికీ కల్పించిన మానవహక్కులు, పనిహక్కు, జీవించేహక్కు వంటి వాటి విషయంలో ప్రభుత్వాలు ఉల్లంఘనలకు పాల్పడకుండా చూసే వ్యవస్థ పౌర సమాజం. బడుగు, బలహీన వర్గాల ప్రయోజనాలకు వెన్నుదన్నుగా నిలవడం, దగాపడిన ప్రజలకు అండగా ఉండటం వీరి హక్కులను కాపాడడం పౌరసమాజం లక్ష్యంగా ఉంది. ప్రగతిశీల సమాజంకోసం ప్రజా సంఘాలు, భావసారూప్యత కల్గిన పౌరసంఘాలు భుజం భుజం కలిపి నడవాలి. అధికారంలోని వారు హక్కులను కాలరాయడం, పత్రికా స్వేచ్ఛపై దాడిచేసి భావ స్వేచ్ఛను బజారుకీడిస్తున్నాయి. ప్రభుత్వ దాడి కన్నా ప్రమాదకరమైన ధోరణి పెట్టుబడిదారీ వ్యవస్థతో పొంచి ఉన్నది, అదే పౌరసమాజాన్ని శాసిస్తోంది. మెజారిటీ ప్రజల భావాలను, మైనారిటీగా ఉన్న పెట్టుబడిదారులు శాసించే స్థాయికి చేరింది. దేశంలో ఎదుగుతున్న పౌర సమాజాన్ని క్రమంగా నిర్వీర్యం చేసే ఎత్తుగడలూ, వ్యూహాలూ శరవేగంగా అమలులోకి వస్తున్నాయన్న గుర్తింపు అవసరం. ప్రజలు ప్రశ్నించే అవకాశాన్ని ఇవ్వకుండా ప్రభుత్వం పక్కా ప్రణాళిక ప్రకారంగానే ఉద్యమకారులపై కేసులు బనాయించి ప్రజా ఉద్యమాలపై ఉక్కుపాదం మోపుతున్నది. ప్రభుత్వం చెబుతున్నదే అభివృద్ధి అని, కాదని ధిక్కరిస్తే ఆగ్రహానికి గురి కావాల్సిందేనని తీరుగా పాలకులున్నారు. ప్రజల పక్షాన నిలబడి, పాలకులు స్వీయ లబ్ధికోసం చేసే పనులను ప్రజలు సమూహంగా ప్రశ్నించాలి. దేశంలో సమస్యలు పెరిగాయి, ప్రజలను తట్టి లేపాల్సిన సమయం వచ్చింది. ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, దేశ సమగ్రత, మహిళా సాధికారత, పర్యావరణం అన్నీ నిర్లక్ష్యంచేస్తూ ప్రైవేటు. కార్పొరేట్‌ల ప్రయోజనాలకు దేశాన్ని తాకట్టు పెట్టారు. గత తొమ్మిది సంవత్సరాలుగా ఉద్యోగం లేక నిరుద్యోగులు, సంపాదన లేక చిరు వ్యాపారస్తులు, గిట్టుబాటుకాని వ్యవసాయంతో రైతులు, ఎదుగు బొదుగూ లేని కార్మికులు, నీచమైన విద్య వ్యవస్థతో విద్యార్థులు, భరోసాలేని అసంఘటిత రంగ వృత్తిదారులు, నిండా మునిగిన చేనేతలు అన్ని రంగాలలో దారిద్ర్యం తాండవిస్తుంది. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, రిపేమేంట్ ఇన్సెంటివ్, పంటనష్టం ఇవ్వరు. బడా పారిశ్రామికవేత్తలకు లక్షల కోట్లు రుణమాఫీ చేస్తారు. నోట్లరద్దుతో ప్రజలను బజారుకీడ్చిన ఘనత మనది. జీఎస్టీతో అన్ని రంగాల ప్రజలను క్షోభకు గురిచేసారు. ఈడీ, సీబీఐ, ఎన్నికల కమిషన్‌లను చెప్పుచేతల్లో పెట్టుకుని బాక్లమెయిలింగ్ కు పాల్పడుతున్నారు. ఎన్నికల్లో ఈవెంట్ మేనేజ్‌మెంట్, స్ట్రాటజిస్ట్‌లు, పోల్ మేనేజ్‌మెంట్, ఎలక్షన్ ఇంజినీరింగ్, సోషియల్ ఇంజినీరింగ్‌తో పాటు డబ్బు, మద్యం విచ్చలవిడిగా ఖర్చుచేస్తూ ఎవరికి ఎంత ఇచ్చారని ప్రజలతో చెప్పిస్తున్నారు.

ప్రజాస్వామ్యం పరిహసించే విధంగా ప్రజల్లో రాజకీయాలంటే ఈసడించుకునే విధంగా తయారవుతున్నారు. మరోవైపు పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవడం లేదు. నమోదు చేసుకున్న వారు కేవలం నలభై లేదా యాభై శాతం మండలి ఎన్నికల్లో పాల్గొంటున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో పౌరసమాజం-పత్రికలు కలిసి పని చేయాలి. కులవివక్ష, మతోన్మాదం, విలువల విధ్వంసం, దళితులపై హింస జరుగుతున్నది. వీటిని వెలికి తీసి ప్రజాక్షేత్రంలో నిలబెట్టాల్సిన బాధ్యత పౌరసమాజంపై ఉన్నది. సోషల్ మీడియాలో ప్రజల పాత్ర పెరగాలి. అబద్ధాలు, అభూత కల్పనలు, అవాస్తవాలు, అస్లీలత, అహింస కల్పిత వార్తలతో సమాజంలో చీలికలు తెస్తారు. కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న పౌర సమాజ వ్యవస్థ (సివిల్ సొసైటీ) కార్యకలాపాలు, అటు ప్రభుత్వానికీ, ఇటు దేశ పౌరులకూ దిక్సూచిగా పనిచేయడానికి వీలైన వాతావరణం ప్రస్తుత పాలనా వ్యవస్థలో మృగ్యమైపోతోంది.

భావప్రకటనా స్వేచ్ఛకోసం, పౌరహక్కుల రక్షణకోసం రాజ్యాంగం లిఖితపూర్వకంగా హామీ ఇచ్చింది. అయితే వాక్, సభా స్వాతంత్ర్యానికి భంగం కలిగించే రీతిలో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న నాయకులు నోటి నుంచి ప్రకటనలు వెలువడుతున్నాయి. ఈ ధోరణిని నాయకులు ఆచరణలో ప్రదర్శిస్తున్నారు. అధికార, అనధికార, పాలక, ప్రతిపక్షాల నుంచి ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైనవారు పారదర్శకంగా, జవాబుదారీతనంతో నడుచుకునే విధంగా చేయడంలో కూడా పౌర సమాజ వ్యవస్థదే కీలకపాత్ర. పౌర సమాజ సంఘాలు, పత్రికలు, మేధావులు అభ్యుదయాన్ని కాంక్షించాలి. ప్రజలను కులం, మతం, ప్రాంతం రొంపిలోకి దింపి పబ్బం గడుపుకుంటున్నారు. దేశం నలుమూలల్లో ప్రభుత్వ స్థాయిలో రహస్యంగా డజన్లకొద్దీ సామాజిక కార్యకర్తలను, మానవహక్కుల పరిరక్షణా సంస్థల నాయకుల్ని, సివిల్ సొసైటీ కార్యకర్తల్నీ (డాక్టర్ పన్సారే, ప్రొఫెసర్ కల్బుర్గీ, దభోల్కర్, గౌరీ లంకేశ్, స్టాన్ స్వామి) హతమార్చిన హంతకుల ఆచూకీ తెలియకుండా పాలక వర్గాలు జాగ్రత్తపడ్డాయి. ప్రజల ఆహార అలవాట్లు, మత విశ్వాసాలలో, వస్త్రధారణలో జోక్యం చేసుకునే విధానానికి తెరలేపి, సెక్యులర్ వ్యవస్థ మౌలిక ప్రయోజనాలనే దెబ్బతీస్తున్నాయి. ఈ విషయంలో స్వామి వివేకానంద, పండిత మదన్ మోహన్ మాలవీయ ఆలోచనలకు ప్రస్తుత పాలనా విధానాలు విరుద్ధంగా ఉన్నాయి. పౌర, ప్రజా సంఘాల మధ్య కలిసి పోదాం కలుపుకు పోదాం అన్న ధోరణి ఉండాలి. భావ సారూప్యత కలిగిన వ్యక్తులు, సంఘాలు, సంస్థలు పార్టీలు ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వ్యాస రచయిత అధ్యక్షులు, ప్రజాసైన్స్ వేదిక

నిదురపోని మెలకువ చెప్పిన కవిత్వం

అతని రెండు చెవుల రెప్పలపై నూనూగు కేశాలు వస్తున్నప్పుడు పరిచయమయ్యాడు ఈ పసునూరి శ్రీధర్ బాబు అనే మామ. నల్గొండ నుంచి ఓ చేతిలో ఎల్ఎల్‌బీ ఐదేళ్ల సర్టిఫికెట్, మరో చేతిలో కవిత్వ కవిలి కట్టలతో చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయంలో. నాకప్పుడు నూనూగు మీసాలే కాని గుప్పెడు మెతుకులు దొరక్క రాంనగర్ వీధుల్లో తిరుగాడే యవ్వనబాల్యం నాది. ఇప్పుడంటే బీబీసీ చానెల్‌లో సీనియర్ జర్నలిస్టు గానీ అప్పుడు నాకు ఈ శ్రీధర్ బాబు నూతిలోంచి బయటపడ్డ బైరాగిలా కనిపించాడు. చలం మైదానం నవల్లో అమీర్ ఇతగాడేమోనని అనిపించాడు. రెండు దశాబ్దాల తర్వాత ఈ శ్రీధర్ సహచరి కనిపించి "మీరు అతనితో మాట్లాడడంలేదు కాని అతను మాత్రం మీతో మాట్లాడు తూనే ఉన్నాడు ఓ నిదురపోని మెలకువలో" అన్నది. అప్పుడర్థ మైంది నాకు చలం అన్నమాటలు "ఎవరి నుంచి దొంగిలించామో వాళ్లని క్షమించడం కష్టం" అనే మాట. అవును... మనమంతా అతని నుంచి దొంగిలించిన వాళ్లమే. అజంతా సెలవు తీసుకున్నాక...ఇస్మాయిల్ కవిత్వానికి శుభం కార్డు వేసేసిన తర్వాత...మో మౌనందాల్చినవేళ...శేషేంద్ర కవిత్వ మాయాజాలం మాయమైన తర్వాత...అప్పుడే ప్రసవించిన పిల్లకోళ్లలాంటి మాకు నిదురపోని మెలకువలో.. అనేక వచనాల్లో...ఈ శ్రీధర్ బాబు చెప్పిన కలలు అన్నీఇన్నీ కావు.



"అక్షరమే అనేక వచనమై/కాగితం మీద కక్ష్యలో పరిభ్రమిస్తూ అనేకానేక నేనలుగా విస్తరించడమే" పసునూరి శ్రీధర్ బాబు కవిత్వం. శుద్ధ కవిత్వం మాత్రమే రాసిన శ్రీధర్ బాబుని పట్టుకోవడం, నాలుగు మాటలు మాట్లాడడమో, రాయడమో కాని చేయలేం. అతని కవిత్వం గురించి మాట్లాడాలంటే లేదా రాయాలంటే కవిత్వంకోసం

చక్రవాకం - ముక్కాముల చక్రధర్

మరణించేంత ప్రేమ ఉండాలి. అందుకేనేమో శ్రీధర్ కవిత్వానికి ముందు మాట రాసిన కె.శ్రీనివాస్ "కష్టమే. నిజంగా కవిత్వం గురించి, కవిత్వం గురించి మాత్రమే నాలుగు ముక్కలు రాయాలంటే కష్టమే" అన్నారు. ఎందుకింత కష్టమంటే..."పరిపూర్ణంగా నాకోసమే నేను చేసే పని బహుశా... కవిత్వమేనేమో..! "అంటాడు శ్రీధర్ బాబు. కవిత్వం శ్రీధర్ బాబు ఊపిరి. కవిత్వం శ్రీధర్ బాబు జీవితం. అతనిదేకాదు... ఏ కవిత్వమైనా...ఎవరురాసిన కవిత్వమైనా అతనికి అంతే. "కవి సమయం" నిర్ణయించుకుని శిక్షణ ఇచ్చే వారిలాగో, లేదా ఆ శిక్షణ పొందినవారు రాసేకవిత్వం వంటిదో కాదు శ్రీధర్ బాబు కవిత్వం. త్రిపురనేని శ్రీనివాస్ అన్నట్లు శుద్ధవచనం రాసి కవిత్వమని బుకాయించని కవి శ్రీధర్ బాబు.

"వాన మొదలైంది/ పెద్దవాళ్లు లోపలికివెళ్లారు/పిల్లలు బయటకు వచ్చారు" ఇది శ్రీధర్ బాబు కవిత్వం. ఇందుకే ఈ కవికి కావాలని ముందు మాట రాసాడు ఇస్మాయిల్ అతని తొలి కవిత్వ సంకలనం అనేక వచనానికి. వేగుంట మోహన్ ప్రసాద్ అయితే మెలకువలోకి వచ్చి కుబ్లాఖాన్ గుర్తొంచ్చిందంటూ మురిసిపోయాడు. శ్రీధర్‌బాబు కవిత్వానికి ఇవేవీ సర్టిఫికెట్లు కావు కాని ఆ పెద్దలని సైతం తన కవిత్వంతో అచ్చెరు వొందేలా చేసిన జ్ఞాపకాలు. శ్రీధర్ బాబుకి కవిత్వం రాయడమే కాదు... అది ఎప్పుడు రాయాలో కూడా తెలుసు. రాయాల్సిన వాళ్లు రాయాల్సినంత రాయకపోవడం వల్ల రాకూడని రాతలు వస్తాయని బెంగటిల్లాడు మహా రచయిత రాచకొండ విశ్వనాథ శాస్త్రి. అది వచనానికే కాదు... కవిత్వానికి కూడా. ఈ కవి పసునూరి శ్రీధర్ బాబు కూడా... " నీ దేహాన్ని/ నిలువెల్లా/తడిమి/ తరించిన/ఈ చేతులతో/ రాస్తే /మంచి కవిత్వమైనా/ రాయాలి/లేదంటే/ చేతులు/ముడుచుకుని కూర్చోవాలి" అంటాడు 'అంతే' అనే కవితలో. విషాదమేమిటంటే ఈ విషయం చాలా మందికి తెలియకపోవడం. చీమల పుట్ట పగిలి చీమలు వచ్చినట్లుగా కవిత్వ ఆన్‌లైన్ శిక్షణాతరగతుల నుంచి కవులు బారులుతీరుతూ వచ్చి అకవిత్వాన్ని దశదిశలా వెదజల్లుతున్నారు. ఆనాటి మర్యాదస్తుడు కనుక రా.వి.శాస్త్రి బెంగటిల్లాడు. శ్రీధర్ బాబులో అ మర్యాద ఇసుమంతైనా లేదుకనుక చేతులు ముడుచుకొండిరా అంటున్నాడు. అర్థం చేసుకోరూ...

(పసునూరి శ్రీధర్‌బాబు 'నిదురపోని మెలకువ చెప్పిన కల' సంకలనానికి ఆదివారం పురస్కారం అందుకుంటున్న సందర్భంగా)

వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్టు, 99120 19929

డెన్మార్క్‌లో వామపక్ష కూటమి హవా

సాత్యకి చక్రవర్తి



డెన్మార్క్‌లో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు సోషల్ డెమోక్రటిక్ పార్టీకి మొగ్గు చూపడంతో దేశంలో నూతన ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఇది యూరోపియన్ వామపక్ష పార్టీలకు శుభపరిణామం. కోవిడ్-19 సంక్షోభాన్ని విజయవంతంగా ఎదుర్కొన్న డెన్మార్క్ మహిళా ప్రధాన మంత్రి మెట్టే ఫ్రెడరిక్‌సెన్ మరో సవాలును అధిగమించవలసిఉంది. పొరుగు దేశాలైన స్వీడన్, ఫిన్‌లాండ్ వంటి దేశాల్లో నెలకొన్న రాజకీయ అనిశ్చితి పరిస్థితుల్లో డెన్మార్క్‌లో వామపక్ష కూటమి విజయం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. గత ఎన్నికల్లో మితవాదుల చేతుల్లో మధ్యేవాద-వామపక్షాలు ఓటమి చవిచూశాయి. రెండు దశాబ్దాల డెన్మార్క్ చరిత్రలో తాజాగా జరిగిన ఎన్నికల్లో సోషల్ డెమోక్రాట్లు బలమైన మద్దతును సంపాదించారు. అయితే ప్రధానిగా ఫ్రెడెరిక్‌సెన్ కరోనా నియంత్రణకు తీసుకున్న వివాదాస్పద నిర్ణయాలపై నెలకొన్న విమర్శల నేపథ్యంలో విశ్లేషకులు అధికారంలో ఉన్న ప్రభుత్వం ఓటమి పాలవుతుందని మితవాద కూటమి అధికారం చేపట్టే అవకాశాలున్నాయని అంచనావేశారు. అయితే ఓటర్లు అనూహ్యరీతిలో ఐదు పార్టీల మధ్యేవాద వామపక్ష కూటమికి మెజారిటీ ఇచ్చారు. దీనితో సోషల్ డెమోక్రాట్లు పార్లమెంటులో 27.5 శాతం ఓట్లతో అతిపెద్ద గ్రూపుగా అవతరించారు.

179 సీట్లు ఉన్న డెన్మార్క్ పార్లమెంట్‌లో వామపక్ష కూటమికి 87 సీట్లు వచ్చాయి. డెన్మార్క్‌లో స్వతంత్ర ప్రాంతమైన ఫరోయిదీవి నుంచి రెండు సీట్ల మద్దతుతో పూర్తి మెజారిటీని సాధించింది. గ్రీన్‌లాండ్ మొత్తంగా మధ్యేవాద వామపక్ష కూటమి 90 సీట్లు కైవశం చేసుకోవడంతో ప్రధాని నూతన ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. అయితే నూతన మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసే ముందు ప్రధాని వామపక్షకూటమితో దేశంలోని సున్నితమైన సమస్యలను పరిష్కరించుకోవాల్సి ఉంది. సాంప్రదాయ వామపక్ష-మధ్యేవాద పక్షాల విభేదాలలో విస్తృత సంకీర్ణాన్ని సమర్థించిన ఫ్రెడరిక్‌సెన్‌కు మెజారిటీ వామపక్ష పార్టీలు తమ సందేహాలను వ్యక్తం చేసే అవకాశం ఉంది. అయితే ఈ పరిస్థితుల్లో రాజకీయ ఐక్యత ఎంతో అవసరమని మెట్టే పేర్కొన్నారు. డెన్మార్క్‌లోని కొన్ని పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థలు వామపక్ష పార్టీల ప్రభావం నుంచి ప్రధానమంత్రిని దూరంగా ఉంచేందుకు ఉమ్మడి సంకీర్ణ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నాయి. అయితే పార్లమెంట్‌లో మధ్యేవాద వామపక్ష కూటమికి స్పష్టమైన మెజారిటీ ఉన్నప్పటికీ మితవాదులతో ప్రభుత్వ ఏర్పాటుకు వామపక్షాలు తిరస్కరించాయి.

దేశంలో కరోనా మహమ్మారి ప్రభావం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, భౌగోళిక, రాజకీయ అనిశ్చితి పరిస్థితుల మధ్య ఫ్రెడరిక్‌సెన్ ప్రభుత్వం దేశాన్ని ముందుకు నడిపించింది. గత ఎనిమిది నెలల్లో డేనిష్ కార్మికులపై తీవ్ర ప్రభావంచూపే పొదుపు చర్యలను చేపట్టాలని ప్రధానమంత్రి పై మధ్యేవాద పార్టీలు, కార్పొరేట్ల నుండి తీవ్ర ఒత్తిడి ఎదురైంది. వామపక్ష ట్రేడ్ యూనియన్ల ఒత్తిడి చేసినప్పటికీ ప్రధానమంత్రి వారి అభిప్రాయాలను పూర్తిగా పరిగణలోకి తీసుకోలేదు. డెన్మార్క్‌లో తీవ్ర అభద్రతాభావానికి ఆజ్యం పోసిన డేనిష్ జలాల ద్వారా రష్యా నుండి జర్మనీకి గ్యాస్ రవాణా చేసే రెండు పైప్‌లైన్‌ల విధ్వంసం జరిగిన ఒక నెల తర్వాత ఈ ఎన్నికలు జరిగాయి. డెన్మార్క్‌లో, మేము ఏళ్లకాలంగా దేశ పురోగతి సాధించాము. దేశంలో ప్రస్తుతం మేము సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాం, ఒక పక్క ఐరోపాలో యుద్ధం, ఇంధన కొరత, ద్రవ్యోల్బణం, వాతావరణ సవాళ్లతో, క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నాం అని ఫ్రెడ్‌రిక్‌సన్ అన్నారు. తక్కువ ఆదాయవర్గాలపై ద్రవ్యోల్బణ ఒత్తిళ్లతో పాటు ఇంధన ధరలు పెరుగుదల ప్రధానమంత్రికి ముందున్న సవాలే. ఆమె తన ప్రభుత్వ సుస్థిరతకు మిత్రపక్షాలను కూడా కలుపుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

న్యుమోనియా నివారణ సాధ్యమే!

ఐదేళ్లలోపు పిల్లల్లో కనిపించే ప్రమాదకర న్యుమోనియా వ్యాధి బారిన 155 మిలియన్ల బాలలు పడడమే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ప్రతిఏటా 1.6 మిలియన్ల మంది పిల్లలు మరణిస్తున్నారు. ఐరాస అంచనాల ప్రకారం విశ్వవ్యాప్తంగా 18 శాతం పిల్లల మరణాలకు ప్రథమ కారణమైన న్యుమోనియా నివారించగల అంటువ్యాధి. ఈ వ్యాధి ముందుగా గుర్తించలేనిది మాత్రమే కాకుండా నిశ్శబ్దంగా, విస్తృతంగా, ప్రమాదకరంగా వ్యాప్తి కూడా చెందుతున్నది. ప్రాణాంతక న్యుమోనియా వ్యాధి పట్ల సంపూర్ణ అనగాహన కలిగించాలనే సదుద్దేశంతో 2009 నుంచి ప్రతి ఏటా 12 నవంబర్ రోజున "ప్రపంచ న్యుమోనియా దినం" పాటిస్తున్నారు. సరైన చికిత్స, టీకాలు అందుబాటులో ఉన్న న్యుమోనియా వ్యాధి భయంకర బ్యాక్టీరియా 'హిమోఫిలస్ ఇన్ఫ్లుయెంజా టైప్-బి','స్ట్రెప్టోకోకస్ న్యుమోనియే'లు సోకడం వల్లనే కాకుండా 'ఆర్థోమైక్సోవైరిడే' అనే వైరస్ కారణంగా కూడా సంక్రమిస్తుంది. ఐరాస మిలినియమ్ డెవలప్‌మెంట్ గోల్స్ ప్రకారం 192 దేశాల్లో న్యుమోనియా కారణ మరణాలను తగ్గించేందుకు పలు చర్యలు తీసుకుంటున్నారు. ప్రపంచ దేశాల్లో నైజీరియా (1.62,000), ఇండియా(1,27,000), పాకిస్థాన్ (58,000), కాంగో(40,000), ఇథియోపియా(32,000)ల్లో న్యుమోనియా మరణాలు అధికంగా ఉన్నాయి.

వెనుకబడిన పేదదేశాల్లో పోషకాహార లోపం, అపరిశుభ్రత, ఆహార కొరత, ఇరుకైన ఇండ్లు, పొగ తాగేవారు ఉండడం, గాలి కాలుష్యం లాంటి కారణాలతో న్యుమోనియా వ్యాధి అధిక బాలల మరణాలకు దారి తీస్తున్నది. న్యుమోనియా నివారణ, చికిత్సలతో సకాలంలో స్పందిస్తే కనీసం ఒక మిలియన్ బాలల మరణాలను అడ్డుకోవచ్చని యునిసెఫ్ అభిప్రాయ పడుతున్నది. బ్యాక్టీరియా/వైరస్/ఫంగస్/పరాన్న సూక్ష్మజీవులు సంక్రమించడంతో సోకే న్యుమోనియా వల్ల బాలల ఊపిరితిత్తుల క్రియాశీలత క్షీణించడం, జ్వరం, దగ్గు, బలహీనత, ఊపిరి పీల్చడం కష్టమవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. న్యుమోనియా సోకిన వ్యక్తి దగ్గడం, తుమ్మడం వల్ల విడుదలయ్యే సూక్ష్మ తుంపరలతో సమీప వ్యక్తులకు వ్యాధి సంక్రమిస్తుంది. వయోవృద్ధులు, టీకాలు వేయించుకోలేని శిశువులకు ఇది ప్రాణాంతకంగా మారుతుంది.

నివారణ మార్గాలు: సులభంగా వ్యాక్సీన్‌లతో నివారించగలిగిన న్యుమోనియా వ్యాధికి తగు చికిత్స మార్గాలు కూడా అందుబాటులో ఉన్నప్పటికీ, ప్రతి రోజు 5 ఏండ్ల లోపు పిల్లలు 2400 మంది చనిపోతున్నారు. దేశ భావిభారత పౌరులైన పిల్లలకు సురక్షిత తాగు నీరు, పరిశుద్ధ గాలి, వ్యక్తిగత పరిశుభ్రత, వ్యాక్సినేషన్, కనీస వైద్యసదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు ఉండాలి. వ్యాధి సంక్రమించకుండా జాగ్రత్తలు తీసుకోవడం, టీకాలు వేయించడం, తొలి దశలో న్యుమోనియాను గుర్తించడం, సరైన ఆంటీబయాటిక్ ఔషధాలతో చికిత్సను వారం రోజులు అందించడం వల్ల న్యుమోనియా వ్యాధి నయం అవుతుంది. శిశువులకు తల్లిపాలు అందించడం, పోషకాహారంతో వ్యాధినిరోధకత పెంచడం కూడా మంచి ఫలితాలను ఇస్తుందని గమనించాలి. 2030 వరకు న్యుమోనియా రహిత సమాజం నిర్మించాలనే లక్ష్యంతో పలు చర్యలు తీసుకుంటున్నారు. సంక్రమిత వ్యాధుల్లో న్యుమోనియా నిరోధక టీకాలను 52 శాతం పిల్లలు నేటికీ తీసుకోకపోవడం సమస్య గంభీరతను తెలియజేస్తున్నది.

ఇండియాలో న్యుమోనియా: న్యుమోనియా కారణ మరణాల సంఖ్యలో ఇండియా 2వ స్థానంలో ఉన్నది. పిల్లల మరణాల్లో 15 శాతం న్యుమోనియా వల్ల జరుగుతున్నాయి. భారతదేశ అంటువ్యాధుల్లో 70 శాతం న్యుమోనియా సంబంధ కారణంగా జరుగుచున్నాయి. గాలి కాలుష్య న్యుమోనియా వల్ల 50 శాతం మరణాలు నమోదు అవుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా న్యుమోనియా సోకిన 32 శాతం పిల్లలకు వైద్య సహాయం అందడం లేదు. యూనిసెఫ్ అంచనాల ప్రకారం గత 5 ఏండ్లలో న్యుమోనియా వల్ల 8 లక్షల పిల్లలు మరణించగా, పుట్టిన మాసం లోపు 1,53,000 పిల్లలు మరణించారు.

(ప్రపంచ న్యుమోనియా దినం నేడు)

డా. బుర్ర మధుసూదన్ రెడ్డి, 9949700037

కాంగ్రెస్-ఎన్‌సీపీ పొత్తు

మూడు స్థానాల్లో పవార్ పార్టీ పోటీ

అహ్మదాబాద్ : వచ్చే నెలలో జరగనున్న గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) ముందస్తు ఎన్నికల పొత్తు పెట్టుకున్నాయి. ఇందులో భాగంగా రాష్ట్రంలోని మొత్తం 182 స్థానాలకుగాను మూడు స్థానాల్లో శరద్ పవార్ నేతృత్వంలోని పార్టీ పోటీ చేస్తుందని ఆ రెండు పార్టీల నాయకులు శుక్రవారం ఇక్కడ తెలిపారు. 2017 అసెంబ్లీ ఎన్నికల్లో రెండు పార్టీలు వేర్వేరుగా పోటీ చేశాయి. ఎన్‌సీపీకి చెందిన కంధల్ జడేజా ఆ పార్టీ నుంచి గెలిచిన ఏకైక ఎమ్మెల్యే. పోర్‌బందర్ జిల్లాలోని కుటియానా అసెంబ్లీ స్థానానికి ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పొత్తు గురించి ప్రకటన వెలువడిన తర్వాత గుజరాత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్ ఠాకూర్ మాట్లాడుతూ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి ఎన్‌సీపీ పోటీ చేస్తుందని అన్నారు. ఈ పొత్తులో భాగంగా ఉమ్రేత్ (ఆనంద్ జిల్లా), నరోద (అహ్మదాబాద్), దేవ్‌గఢ్ బరియా (దహోద్ జిల్లా) లో ఎన్‌సీపీ పోటీ చేస్తుందని తెలిపారు. కాగా ఈ మూడు సీట్లు ప్రస్తుతం అధికార బీజేపీ చేతిలో ఉన్నాయి. 'యూపీఏ-1, 2 లో మాతో కలిసి ఉన్న పార్టీలతో పొత్తు పెట్టుకోవాలని కాంగ్రెస్ నిర్ణయించింది' అని ఠాకూర్ తెలిపారు. 125 సీట్ల విజయంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారం చేపడుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఒకే భావజాలాన్ని పంచుకునే వ్యక్తులు, రాజ్యాంగాన్ని అలాగే దేశ సమైక్యతను కాపాడటానికి కృషి చేస్తున్న వ్యక్తులు ఫాసిస్ట్ శక్తులకు వ్యతిరేకంగా కలిసి వస్తున్నారని, అందులో భాగమే ఈ కూటమి అని అన్నారు. ఎన్‌సీపీ రాష్ట్ర విభాగం అధ్యక్షుడు జయంత్ పటేల్ విలేకరులతో మాట్లాడుతూ గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎన్‌సీపీ మద్దతు ఇస్తుందని తెలిపారు. 'ఈ మూడు స్థానాల్లో నిజాయితీతో పోటీ చేసేలా చూస్తాం. కాంగ్రెస్ మాపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు. ఎన్‌సీపీ ప్రతిష్ఠకు భంగం కలిగించే ఏ పని చేయబోం' అని అన్నారు. ఠాకూర్ మాట్లాడుతూ ఎన్‌సీపీ శ్రేణులు మరిన్ని సీట్లకు డిమాండ్ చేసే అవకాశం ఉందని, కానీ పొత్తు ప్రకారం, పార్టీ మూడు స్థానాల్లో మాత్రమే పోటీ చేస్తుందని తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థుల రెండవ జాబితాలో 21 మంది సిట్టింగ్‌లు

రెండు దశాబ్దాలకు పైగా గుజరాత్‌లో అధికారం నుంచి దూరంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ వచ్చే నెలలో జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోసం తన సిట్టింగ్ ఎమ్మెల్యేలు 21 మందిని రంగంలోకి దించింది. 46 మంది అభ్యర్థులతో కూడిన తన రెండవ జాబితాలో నలుగురు ముస్లింలను అభ్యర్థులుగా ప్రకటించింది. బీజేపీ అధికారంలో ఉన్న గుజరాత్‌లో ఎన్నికలు డిసెంబర్ 1, 5 తేదీల్లో రెండు దశల్లో జరుగుతాయి. డిసెంబర్ 8న ఓట్లను లెక్కిస్తారు. కాగా అసెంబ్లీలో మొత్తం 182 స్థానాలకుగాను ఎన్నికల తొలి దశ డిసెంబర్ 1న 89 స్థానాలకు ఓటింగ్ జరగనుంది. అయితే కాంగ్రెస్ పార్టీ నవంబర్ 4న మొదటి, రెండవ దశ ఎన్నికలకు 43 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను విడుదల చేసింది. రెండవ జాబితాలో మొత్తం 46 మందిని తొలి దశ ఎన్నికల అభ్యర్థులుగా ప్రకటించింది. ఇప్పటి వరకు తొలి దశ ఎన్నికలకు 68 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. అయితే మోర్బి, తలాలా, భావ్‌నగర్-రూరల్, ధారి, కోడినర్, రాపర్, బరూచ్, తూర్పు రాజ్‌కోట్, పశ్చిమ రాజ్‌కోట్, జంబూసర్, నవ్‌సారి, జామ్‌నగర్ రూరల్ సహా 21 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. 46 మంది అభ్యర్థుల తాజా జాబితా ప్రకారం, ప్రతిపక్ష మాజీ నాయకుడు, అమ్రేలి ఎమ్మెల్యే పరేష్ ధనాని, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు, టంకర ఎమ్మెల్యే లలిత కగతారా, ఉనా స్థానానికి చెందిన సీనియర్ ఎమ్మెల్యే పుంజ్ వంశ్ సహా 21 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలను రానున్న ఎన్నికల్లో పోటీ చేయించడం ద్వారా పార్టీ సురక్షితమైన పోరుకు సంసిద్ధమైనట్లుగా కనిపిస్తోంది. సిట్టింగ్ ఎమ్మెల్యేలను నిలబెట్టిన ఇతర స్థానాలు... దాసదా, చోటిలా, ధోరాజీ, కలవాడ్ (ఎస్సీ), ఖంభాలియా, జంజోధ్‌పూర్, జునాగఢ్, మంగ్రోల్, సోమనాథ్, లాఠీ, సవర్కుండ్లా, రాజుల, తలజా, మాండవి (ఎస్టీ), వ్యార (ఎస్టీ) , నిజార్ (ఎస్టీ), వస్సదా (ఎస్టీ) ఉన్నాయి. ఇప్పటివరకు, డిసెంబర్ 1న ఎన్నికలకు వెళ్లే స్థానాల నుంచి కాంగ్రెస్ పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యేలలో ఎవరినీ వదులుకోలేదు. అయితే మిగిలిన 21 స్థానాలకు ప్రకటన కోసం వేచి ఉంది. తాజా జాబితాలో నలుగురు ముస్లిం అభ్యర్థులను ప్రకటించింది. వీరిలో వంకనేర్ స్థానం సిట్టింగ్ ఎమ్మెల్యే మహ్మద్ జావేద్ పిర్జాదా ఉన్నారు. ఆయనతో పాటు అబ్బాదా సీటుకు మమద్‌భాయ్ జంగ్ జాట్‌కు, వగ్రాకు సులేనన్ పటేల్‌కు, తూర్పు సూరత్‌కు అస్లాం సైకిల్‌వాలాకు టికెట్లు ఇచ్చింది. కాగా తొలి దశలో ఉన్న 89 స్థానాల్లో అధికార బీజేపీ ఇప్పటి వరకు 84 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. తొలి విడత నామినేషన్ల దాఖలుకు డిసెంబర్ 14 చివరి రోజు. 2017 రాష్ట్ర ఎన్నికలలో కాంగ్రెస్ 77 సీట్లు గెలుచుకుంది. అయితే అనేక మంది ఎమ్మెల్యేలు విధేయతను మార్చుకున్న తర్వాత అసెంబ్లీలో దాని ప్రస్తుత బలం 59కి పడిపోయింది.

దక్షిణాదిన 'వందేభారత్' రైలు

పచ్చజెండా ఊపి...ప్రారంభించిన మోదీ

బెంగళూరు: దక్షిణాది రాష్ట్రాల పర్యటన నిమిత్తం ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం బెంగళూరు చేరుకున్నారు. ఈ ఉదయం బెంగళూరులోని హెచ్‌ఏఎల్ ఎయిర్‌బేస్‌కు చేరుకున్న ప్రధానికి కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్, సీఎం బసవరాజ్ బొమ్మై, కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషీ తదితరులు స్వాగతం పలికారు. ఆ తర్వాత మోదీ...వందే భారత్ ఎక్స్‌ప్రెస్, భారత్ గౌరవ్ కాశీ దర్శన్ రైలును పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ రైలు బెంగళూరు మీదుగా మైసూరు, చెన్నైని కలుపుతూ నడుస్తుంది. దేశంలోనే ఇది ఐదో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు. దీంతో పాటు భారత్ గౌరవ్ కాశీ దర్శన్ రైలును కూడా ప్రధాని ప్రారంభించారు. ఇది యాత్రికుల కోసం తీసుకొచ్చిన రైలు. ఎనిమిది రోజుల టూర్ ప్యాకేజీ ఉండే ఈ రైలులో వెళ్లి వారణాసి, అయోధ్య, ప్రయాగ్‌రాజ్ వంటి పవిత్ర స్థలాలను దర్శించుకోవచ్చు. అంతకుముందు మోదీ.. ప్రముఖ కవి కనకదాస జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఆ తర్వాత మహర్షి వాల్మీకి విగ్రహాన్ని సందర్శించి అంజలి ఘటించారు.

కెంపెగౌడ విగ్రహావిష్కరణ

బెంగళూరు సిటీ వ్యవస్థాపకుడు, నగరాభివృద్ధికి విశేష కృషి చేసిన నాగప్రభు కెంపెగౌడ 108 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని నరేంద్ర మోదీ ఆవిష్కరించారు. నాగప్రభు కెంపెగౌడ స్మారకార్థం 'అభ్యుదయ విగ్రహం' పేరుతో దీనిని ఏర్పాటు చేశారు. 98 టన్నుల కాంస్యం, 12 టన్నుల స్టీల్‌తో ప్రముఖ శిల్పకళాకారుడు రామ్ వి సుతార్ ఈ విగ్రహాన్ని తీర్చిదిద్దారు. బెంగళూరులోని కెంపెగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్-2ను ప్రధాని ప్రారంభించారు. 5 వేల కోట్ల రూపాయలతో ఈ టెర్మినల్ నిర్మాణం జరిగింది. బెంగళూరులోని క్రాంతివీర సంగొల్లి రాయన్న రైల్వేస్టేషన్ నుంచి చెన్నై-మైసూరు వందే భారత్ ఎక్స్‌ప్రెస్, భారత్ గౌరవ్ కాశీ దర్శన్ రైలును ప్రధాని పచ్చజెండా ఊపి ప్రారంభించారు. దేశంలోని వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లలో ఇది ఐదవది కాగా, దక్షిణాదిన తొలి వందేభారత్ ఎక్స్‌ప్రెస్ కావడం విశేషం. చెన్నై ఇండస్ట్రియల్ హబ్‌కు, బెంగళూరు టెక్ అండ్ స్టార్టప్ హబ్‌కు మధ్య వారధిగా ఈ ఎక్స్‌ప్రెస్ నిలుస్తుందని పీఎంఓ తెలిపింది.

ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో కేజ్రీవాల్ 10 హామీలు

న్యూఢిల్లీ : డిసెంబరు 4న జరగనున్న ఢిల్లీ మున్సిపల్ ఎన్నికలకు ఆప్ నేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ శుక్రవారం కీలక హామీలు ఇచ్చారు. ల్యాండ్‌ఫిల్ సైట్‌లను పూర్తి చేయడం, పౌర సంస్థలలో అవినీతిని అంతం చేయడం, దాని ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వడం సహా 10 హామీలను ప్రకటించారు. విలేకరుల సమావేశంలో కేజ్రీవాల్ మాట్లాడుతూ ఎంసీడీలో 15 సంవత్సరాల పదవీకాలంలో ఏమీ చేయని బీజేపీకి భిన్నంగా, ఆప్ ఎల్లప్పుడూ తన వాగ్దానాలను నెరవేర్చిందని అన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ 20 సీట్లకు మించి గెలవదని తెలిపారు. 'భవనం మ్యాప్ ఆమోదం కోసం సులభమైన ఆన్‌లైన్ ప్రక్రియను ప్రవేశపెట్టడం ద్వారా ఎంసీడీని అవినీతి రహితంగా చేస్తామని మేము హామీ ఇస్తున్నాం. పార్కింగ్ స్థలం సమస్యకు శాశ్వత, ఆచరణాత్మక పరిష్కారాన్ని అందిస్తాం. రోడ్లపై ఇబ్బంది కలిగించే విచ్చలవిడి జంతువులను నియంత్రించడం, గోతులు పడిన రోడ్లను సరిచేస్తాం' అని ఆప్ జాతీయ కన్వీనర్ చెప్పారు. ఎంసీడీ పాఠశాలలు, డిస్పెన్సరీల నాణ్యతను మెరుగుపరచడం, పౌర సంస్థ అధ్వర్యంలోని పార్కులను సుందరీకరించడం, దాని ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించేలా చూడటం కూడా ఆప్ ఉద్దేశమని అన్నారు. 'వ్యాపారులు కూడా చాలా ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఇన్‌స్పెక్టర్ రాజ్‌ను ముగించడం, అమ్మకం ప్రాంతాలను సృష్టించడం, వీధి వ్యాపారులకు లైసెన్స్‌లు అందించడం ద్వారా వ్యాపారులకు ఉపశమనం కలిగించాలని మేము భావిస్తున్నాం' అని తెలిపారు. ఆప్‌ను అడ్డుకునేందుకే ఎంసీడీ ఎన్నికలు, గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరుగుతున్నాయని ముఖ్యమంత్రి ఆరోపించారు. అయితే ఈ రెండు ఎన్నికల్లోనూ తాము గెలుస్తామని అన్నారు. 'వారు (బీజేపీ) 20 సీట్లకు మించి గెలవరని నేను లిఖితపూర్వకంగా ఇవ్వగలను. గత 15 ఏళ్లుగా ప్రజలు మోసం చేస్తున్నారు. కానీ మేం చెప్పినట్టే చేస్తాం' అని కేజ్రీవాల్ తెలిపారు. బీజేపీ కేంద్రం నుంచి నిధులు తెస్తామని, ఢిల్లీని చెత్త రహితంగా తీర్చిదిద్దుతామని, చెత్త కొండలను తొలగిస్తామని హామీ ఇచ్చి ఏమీ చేయలేదని అన్నారు.

హిమాచల్ ఎన్నికల్లో కోటీశ్వరుల హవా

- కాంగ్రెస్ అభ్యర్థులు 90 శాతం మంది
- 82 శాతంతో బీజేపీ రెండవ స్థానం

సిమ్లా: హిమాచల్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో కోటీశ్వరుల సంఖ్యే ఎక్కువగా ఉంది. శనివారం జరిగే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు దాదాపు 90 శాతం మంది, బీజేపీకి చెందిన 82 శాతం మంది అభ్యర్థులు ధనిక వర్గానికి చెందిన వారుగా ఉన్నట్లు ఒక నివేదిక తెలిపింది. రాష్ట్రంలో మొత్తం 68 అసెంబ్లీ స్థానాలకుగాను 67 స్థానాలకు అభ్యర్థులను నిలబెట్టిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కి చెందిన 35 మంది లేదా 52 శాతం మంది కోటీశ్వరులేనని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) నివేదిక వెల్లడించింది. ఇక 53 స్థానాలకు పోటీ చేస్తున్న బీఎస్‌పీకి చెందిన 25 శాతం లేదా 13 మంది అభ్యర్థులు, సీపీఎంకు చెందిన నలుగురు అభ్యర్థులు (36 శాతం) ఈ ధనిక వర్గం జాబితాలో ఉన్నారు. 45 మందికి పైగా స్వతంత్ర అభ్యర్థులు కూడా కోటీశ్వరులే. కాంగ్రెస్‌కు చెందిన 61 మంది, బీజేపీ నుంచి 56 మంది అభ్యర్థులు కోటీశ్వరులుగా ఉన్నారు. మొత్తంగా, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల్లో పోటీ చేస్తున్న 412 మంది అభ్యర్థులకుగాను 55 శాతం (226) మంది అభ్యర్థులు కోటీశ్వరుల జాబితాలో ఉన్నారు. సిమ్లాలోని చోపల్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి బల్బీర్ సింగ్ వర్మ రూ.128 కోట్ల ఆస్తితో కోటీశ్వరులైన అభ్యర్థుల జాబితాలో అగ్ర స్థానంలో ఉన్నారు. సిమ్లా రూరల్ స్థానం నుంచి బరిలోకి దిగిన మాజీ ముఖ్యమంత్రి వీరభద్ర సింగ్ కుమారుడు విక్రమాదిత్య సింగ్, మొత్తం రూ.101 కోట్లతో రెండవ స్థానంలో నిలిచారు. అలాగే కంగర్ జిల్లాలోని నంగ్రోటా సీట్ల నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు దివంగత జి.ఎస్.బాలి కుమారుడు ఆర్.ఎస్.బాలి మొత్తం రూ.96.36 కోట్లతో మూడవ స్థానంలో ఉన్నారు. అలాగే, 66 మంది కోటీశ్వరుల అభ్యర్థులు నేరారోపణలు ఎదుర్కొంటున్నారు. థియోగ్ స్థానం సీపీఎంకి చెందిన రాకేష్ సింఘా అత్యధికంగా 30 క్రిమినల్ కేసులు, సిమ్లా జిల్లాలోని కసుమప్తి స్థానం నుంచి సీపీఎంకు చెందిన కులదీప్ సింగ్ తన్వర్ 20 క్రిమినల్ కేసులు, విక్రమాదిత్య సింగ్ 11 క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. ఏడీఆర్ విడుదల చేసిన నివేదిక ప్రకారం... మళ్లీ పోటీ చేస్తున్న 58 మంది ఎమ్మెల్యేలలో 49 మంది ఎమ్మెల్యేల (84 శాతం) ఆస్తులు ఐదు శాతం నుంచి 1,167 శాతానికి పెరిగాయి. తొమ్మిది మంది ఎమ్మెల్యేల ఆస్తులు (16 శాతం) తగ్గాయి. 2017లో స్వతంత్రులతో సహా వివిధ పార్టీలు తిరిగి పోటీ చేసిన ఈ 58 మంది ఎమ్మెల్యేల సగటు ఆస్తులు రూ.9.30 కోట్లు కాగా, 2022లో రూ.12.08 కోట్లకు పెరిగాయి. 2017-2022 అసెంబ్లీ ఎన్నికల మధ్య ఈ 58 మంది ఎమ్మెల్యేల సగటు ఆస్తి వృద్ధి రూ.2.77 కోట్లు (30 శాతం) వృద్ధి అని నివేదిక తెలిపింది. బీజేపీ అభ్యర్థి బల్బీర్ సింగ్ వర్మ 2017 నుంచి గరిష్ఠంగా రూ.37.71 కోట్ల ఆస్తులు పెరిగినట్లు ప్రకటించారు. బీజేపీకి చెందిన అనిల్ శర్మ ఆస్తులు రూ.17.23 కోట్లు పెరిగి 2017లో రూ.40.24 కోట్ల నుంచి 2022లో రూ.57.48 కోట్లకు చేరుకున్నాయి. విక్రమాదిత్య సింగ్ ఆస్తులు 2017లో రూ.84.32 కోట్ల నుంచి రూ.17.06 కోట్లు పెరిగి 2022లో రూ.101.39 కోట్లకు చేరుకున్నాయి. పార్టీల వారీగా విశ్లేషిస్తే... 2017లో రూ.7.25 కోట్లుగా ఉన్న 35 మంది బీజేపీ అభ్యర్థుల సగటు ఆస్తులు రూ.3.20 కోట్లు (44 శాతం) పెరిగి 2022లో రూ.10.46 కోట్లకు చేరాయి. 20 మంది కాంగ్రెస్ అభ్యర్థులకు సగటు ఆస్తి పెరుగుదల రూ.2.3 కోట్లు. (17.72 శాతం) 2017లో రూ.13.01 కోట్ల నుంచి 2022లో రూ.15.31 కోట్లకు చేరుకుంది.

రాహుల్ మాట్లాడుతుంటే మైక్ కట్?

భారత్ జోడో యాత్రలో ఆసక్తికర సన్నివేశం

నాందేడ్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'భారత్ జోడో యాత్ర'లో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. నాలుగు రోజులుగా మహారాష్ట్రలో రాహుల్ యాత్ర కొనసాగుతోంది. శుక్రవారం నాందేడ్ జిల్లాలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాహుల్ మాట్లాడుతుండగా ఒక్కసారిగా మైక్ ఆగిపోయింది. ఆయన ఏదో చెబుతుండగా...మళ్లీ ఆన్ అయింది. ఏమైందోనని అక్కడున్న వారంతా ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. రాహుల్ గాంధీనే ఇదంతా చేశారు. ఇంతకీ ఏమి జరిగిందంటే.. రాహుల్ తన ప్రసంగం కొనసాగిస్తూ...మధ్యలో తనే మైక్ ఆఫ్ చేశారు.. తర్వాత ఆయనే మళ్లీ ఆన్ చేశారు. కాంగ్రెస్ నాయకులు పార్లమెంట్‌లో మాట్లాడుతున్నప్పుడు అధికార బీజేపీ ఇలాగే ప్రవర్తిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. 'స్విచ్ కంట్రోల్స్ ప్రస్తుతం నా చేతుల్లో ఉన్నాయి కాబట్టి సరిపోయింది. పార్లమెంట్‌లో ఇలా జరిగితే ఏం చేయగలం? 2016లో నోట్ల రద్దు గురించి మాట్లాడితే మైక్ ఆఫ్.. భారత్ భూభాగాన్ని చైనా ఆక్రమిస్తోందని పార్లమెంటులో గొంతు వినిపిస్తుంటే మైక్ ఆఫ్..' అని రాహుల్ విమర్శించారు. తాము ఏది మాట్లాడినా ప్రజలు దానిని వినకుండా అడ్డుకుంటున్నారని, అందుకే భారత్ జోడో యాత్రలో తమ గొంతు వినిపిస్తూ, అందర్నీ ఏకతాటి పైకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నామని రాహుల్ చెప్పారు. దీనికి సంబంధించిన వీడియోను ఆ పార్టీ నాయకురాలు సుప్రియా శ్రీనేట్ ట్విటర్‌లో పోస్టు చేశారు. కాంగ్రెస్ నేతలపైకి (ఈడీ)ని ఉసిగొల్పి, నియంత్రించాలని చూస్తున్నారని, అయితే ఎట్టిపరిస్థితుల్లోనూ భయపడే ప్రసక్తే లేదని రాహుల్ గాంధీ అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్లమెంట్ లోపల, బయట ప్రతిపక్షం గొంతు నొక్కేశారని ఆరోపించారు. సెప్టెంబరు 1న కన్యాకుమారిలో ప్రారంభమైన రాహుల్ 'భారత్ జోడో యాత్ర' కశ్మీర్ వరకు దాదాపు 3,750 కిలోమీటర్ల మేర సాగనుంది.

అభివృద్ధిని ఆపొద్దు

హిమాచల్ వాసులకు మోదీ లేఖ

న్యూఢిల్లీ: దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన హిమాల్‌ప్రదేశ్‌లో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అభివృద్ధి పనులను వేగవంతం చేసిందని, ఇది కొనసాగాలంటే తిరిగి బీజేపీని ఎన్నుకోవాలని ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్ర ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు శనివారం జరగనున్నాయి. '2014లో మేం అధికారంలోకి వచ్చిన సమయంలో హిమాచల్ ప్రదేశ్‌లో వేరే పార్టీ ప్రభుత్వం ఉంది. ఆ పార్టీ కేంద్ర ప్రభుత్వ పథకాలను అమలు చేయలేదు. ఇక్కడ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పనులను మేం వేగవంతం చేశాం. వాటిని మీరు ఇప్పుడు ఆపకూడదు. ఉజ్వల్ పథకం, మరుగుదొడ్ల నిర్మాణం, ప్రతి ఇంటికి పైపుల ద్వారా నీటి సరఫరా వంటి పథకాలు ఇప్పుడు ఫలితాలు చూపిస్తున్నాయి. అమ్మలు, సోదరీమణుల జీవితాలు బాగుపడ్డాయి. ఇప్పుడు ఈ రాష్ట్రం అభివృద్ధి చెంది పర్యాటక కేంద్రంగా మారింది. అందరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి' అని మోదీ ఆ లేఖలో కోరారు. హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం గురువారంతో ముగిసింది. రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఆప్ కూడా విస్తృత ప్రచారం చేపట్టింది. డిసెంబర్ ఎనిమిదిన ఫలితాలు వెలువడనున్నాయి.

మధ్యాహ్న భోజనం తిని 200 మంది విద్యార్థులకు అస్వస్థత



భాగల్పూరు: బల్లి పడినట్లు అనుమానిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని బలవంతంగా తినిపించడంతో 200 మంది విద్యార్థులు ఆస్పత్రిపాలయ్యారు. ఈ విషాద ఘటన బీహార్‌లోని భాగల్పూర్‌లో చోటుచేసుకొంది. మధ్యాహ్న భోజనం చేసిన విద్యార్థులు ట్యూషన్ క్లాసులకు వెళ్లగా.. అక్కడ ఒకరికి వాంతులయ్యాయి. ఆ తర్వాత కొద్దిసేపటికే మిగిలిన విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యారు. దీంతో పాఠశాల సమీపంలోని ఓ వైద్యకేంద్రానికి విద్యార్థులను తరలించి పోలీసులకు సమాచారం అందించారు. 8వ తరగతి విద్యార్థి పళ్లెంలో చనిపోయిన బల్లి కనిపించడంతో ఈ విషయాన్ని విద్యార్థులు ప్రధానోపాధ్యాయుడి దృష్టికి తీసుకెళ్లారు. కానీ, ఆయన దానిని బల్లి కాదని...వంకాయని విద్యార్థులకు చెప్పాడు. పాఠశాల అధికారులు కూడా విద్యార్థులను ఆహారం తినాలని బలవంతం చేశారు. ఆ ఆహారం తిన్న తర్వాతే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనను విద్యాశాఖ తీవ్రంగా పరిగణించింది. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రధానోపాధ్యాయుడు, సిబ్బంది తప్పు చేసినట్లు తేలితే అరెస్టు చేస్తామని పేర్కొన్నారు. డీఎస్పీ స్థాయి అధికారి ఒకరు వైద్యశాల వద్ద పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్‌లో సోదాలు

- రికార్డు స్థాయిలో నగదు, మద్యం స్వాధీనం
- ఎన్నికల సంఘం వెల్లడి

న్యూఢిల్లీ: ఎన్నికలవేళ గుజరాత్, హిమాచల్ ప్రదేశ్‌లో నిర్వహించిన సోదాల్లో నగదు, మద్యం, ఇతర వస్తువులను రికార్డు స్థాయిలో స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల సంఘం (ఈసీ) శుక్రవారం వెల్లడించింది. హిమాచల్‌ప్రదేశ్‌లో శనివారం పోలింగ్ జరగనుండగా, గుజరాత్‌లో డిసెంబర్ 1, 5 తేదీల్లోజరగనుంది.డిసెంబర్ 8న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. 2017 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే హిమాచల్ ప్రదేశ్‌లో బలవంతపు స్వాధీనతలు ఐదు రెట్లు పెరిగాయని ఈసీ తెలిపింది. ఈ విషయంలో తమ సమగ్ర ప్రణాళికననుసించి తీసుకున్న చర్యల వల్ల ప్రోత్సాహకర ఫలితాలొచ్చాయని పేర్కొంది. గుజరాత్‌లో ఎన్నికల ప్రకటన వెలువడిన కొద్ది రోజుల్లోనే రూ.71.88 కోట్లు లెక్కలు లేని నగదు పట్టుబడింది. ఇది 2017 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల నిబంధనావళి అమలైన మొత్తం వ్యవధిలో స్వాధీనం చేసుకున్న రూ.27.21 కోట్ల కంటే ఇది అధికం. అదేవిధంగా హిమాచల్ ప్రదేశ్‌లో ఐదేళ్ల క్రితం ఎన్నికల సందర్భంగా పట్టుబడ్డ నగదు రూ. 9.03 కోట్లు కాగా, ఈసారి అది రూ. 50.28 కోట్లు. ఇది ఐదు రెట్లు ఎక్కువ అని ఈసీ వివరించింది. ముంద్రా పోర్ట్‌లో దిగుమతి కార్గోలో దాచిపెట్టడం ద్వారా అక్రమంగా తరలిస్తున్న రూ. 64 కోట్ల విలువైన బొమ్మలు, ఉపకరణాలను పట్టుకోవడం అతి పెద్ద ఘటనగా డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ నివేదించినట్లు ఈసీ తెలిపింది. ఈ కేసులో సూత్రధారితో సహా ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామని, తదుపరి దర్యాప్తు పురోగతిలో ఉన్నట్లు పేర్కొంది. నవంబర్ 10వ తేదీ వరకు హిమాచల్ ప్రదేశ్‌లో రూ.17.18 కోట్ల నగదు, రూ.17.5 కోట్ల విలువైన మద్యం, రూ.1.2 కోట్ల విలువైన డ్రగ్స్, 41 లక్షల విలువైన గృహోపకరణాలను స్వాధీనం చేసుకున్నట్లు ఈసీ వివరించింది. అదేవిధంగా గుజరాత్‌లో గురువారం వరకు రూ.66 లక్షల నగదు, రూ.3.86 కోట్ల విలువైన మద్యం, రూ.94 లక్షల విలువైన డ్రగ్స్, రూ.64.56 కోట్ల విలువైన గృహోపకరణాలు, బొమ్మలు స్వాధీనం చేసుకున్నారు. బీహార్, ఒడిశా, మహారాష్ట్ర, తెలంగాణ, హరియాణా, ఉత్తరప్రదేశ్‌లలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇటీవల జరిగిన ఉపఎన్నికల్లో కూడా రూ.9.35 కోట్ల మేర భారీగా నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఈసీ తెలిపింది. తెలంగాణలోని ' మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో స్వాధీనాలు జరిగాయి. ఇక్కడ వేల లీటర్ల మద్యం, రూ.1.78 కోట్ల విలువ గల ఆభరణాలతో పాటు రూ. 6.6 కోట్ల నగదు పట్టుబడింది.

ఢిల్లీ మున్సిపల్ ఎన్నికలను బహిష్కరిస్తాం

అంగన్‌వాడీ యూనియన్ నిర్ణయం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో జరిగే మున్సిపల్ ఎన్నికలను బహిష్కరించనున్నట్లు రాష్ట్ర అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రకటించింది. అలాగే ఇక్కడ రెండు ప్రధాన పార్టీలైన అధికార ఆమ్ ఆద్మీ, బీజేపీకి వ్యతిరేకంగా ప్రచారం చేయనున్నట్లు ప్రకటించింది. ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం 884 మంది అంగన్‌వాడీ వర్కర్లను ఆకస్మికంగా తొలగించడంపై యూనియన్ రెండు పార్టీలకు వ్యతిరేకంగా గళమెత్తింది. ఢిల్లీలోని 250 వార్డుల మున్సిపల్ కార్పొరేషన్‌కు డిసెంబర్ 4న ఎన్నికలు జరగనుండగా, ఫలితాలు డిసెంబర్ 7న వెలువడనున్నాయి. రాష్ట్ర అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు శివాని కౌల్ మాట్లాడుతూ... తమ పరిధిలోని 22 వేల మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లతో పాటు వారి కుటుంబ సభ్యులు కూడా ఆప్, బీజేపీ అభ్యర్థులకు ఓట్లు వేయొద్దని పిలుపునిచ్చారు. యూనియన్ రెండు పార్టీల అభ్యర్థులకు వ్యతిరేకంగా 'ఓటు బంది' ప్రచారాన్ని కూడా ప్రారంభించనుంది. కనీస వేతనం పెంపు, గౌరవప్రదమైన పని గంటల కోసం 39 రోజుల పాటు సమ్మెలో పాల్గొన్నందుకు ఢిల్లీ ప్రభుత్వం 884 మంది అంగన్‌వాడీ ఉద్యోగులకు తొలగింపు నోటీసులు, మరో 11,942 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేసిందని యూనియన్ పేర్కొంది.

జార్ఖండ్‌లో రిజర్వేషన్లు 77శాతానికి పెంపు!

రాంచీ: జార్ఖండ్ లో వివిధ వర్గాలకు విద్య, ఉద్యోగావకాశాల్లో కల్పిస్తున్న మొత్తం రిజర్వేషన్లను 77 శాతానికి పెంచుతూ హేమంత్ సోరెన్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన బిల్లును ఆ రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించింది. దీని కోసం శుక్రవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. జార్ఖండ్ రిజర్వేషన్ 2001 రిజర్వేషన్ చట్టానికి చేసిన సవరణను అసెంబ్లీ ఆమోదించింది. దీని ప్రకారం ఎస్టీ, ఎస్సీ, ఈబీసీ, ఓబీసీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు (ఈబీసీ) ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లు 60 శాతం నుంచి 77 శాతానికి పెరగనున్నాయి. రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో దీనిని చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతోందని బిల్లు ప్రతిపాదించింది. ప్రతిపాదిత రిజర్వేషన్‌లో ఎస్సీ వర్గానికి చెందిన స్థానిక ప్రజలకు 12 శాతం, ఎస్టీలకు 28 శాతం, అత్యంత వెనుకబడిన తరగతులకు (ఈబీసీలు) 15 శాతం, ఓబీసీలకు 12 శాతం, ఇతర రిజర్వ్‌డ్ కేటగిరీలను మినహాయించి ఈడబ్ల్యూఎస్‌కు 10 శాతం కోటా లభించనుంది. ప్రస్తుతం జార్ఖండ్‌లో ఎస్టీలకు 26 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఓబీసీలు 14 శాతం రిజర్వేషన్ కోటాను పొందుతున్నారు. రిజర్వేషన్లు పెంచుతామని 2019 ఎన్నికల్లో జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ పాలక కూటమితో పాటు అన్ని ప్రధాన పార్టీలు హామీ ఇచ్చాయి.

బీజేపీ నిరసన

సోరెన్ ప్రభుత్వం ఈ బిల్లు అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించుకునే క్రమంలో బీజేపీ ఎమ్మెల్యేలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అయినా ఈ బిల్లుకు ఆమోదం లభించింది. ప్రతిపక్షాల కుట్రలను భగ్నం చేసిన రాష్ట్ర ప్రజలకు ఈ చట్టం 'సురక్ష కవచ్' (భద్రతా కవచం) అని ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఈ సందర్భంగా అభివర్ణించారు. అయితే కొన్ని సవరణలు, అసెంబ్లీ కమిటీ పరిశీలన కోసం బిల్లును పంపాలన్న కొంతమంది సభ్యుల ప్రతిపాదనను అసెంబ్లీ తిరస్కరించింది.

శివలింగం భద్రత పెంపు

న్యూఢిల్లీ: వారణాసిలోని జ్ఞానవాపి మసీదు కాంప్లెక్స్‌లో కనుగొన్న శివలింగానికి ఇస్తున్న రక్షణను పొడిగిస్తూ సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశాలిచ్చింది. తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకూ శివలింగానికి రక్షణ కల్పించాలని స్పష్టం చేసింది. జ్ఞానవాపి-కాశీ విశ్వనాథ్ కేసు వినేందుకు ప్రత్యేక ధర్మాసనం ఏర్పాటుకు అత్యున్నత న్యాయస్థానం అంగీకరించింది. శివలింగం ఉంటున్న ప్రాంతానికి భద్రత కొనసాగించాలని హిందూ వర్గాలు తమ పిటిషన్‌లో సుప్రీంకోర్టును కోరాయి. హిందూ భక్తుల తరపున హాజరైన అడ్వకేట్ విష్ణు శంకర్ వాదనలను సీజేఐ డీవై చంద్రచూడ్‌తో కూడిన బెంచ్ గురువారం విచారించింది. శివలింగానికి సుప్రీంకోర్టు కల్పించిన రక్షణ ఈనెల 12తో ముగుస్తున్నందున, భద్రతను పొడగించాలని విష్ణు శంకర్ కోర్టు దృష్టికి తెచ్చారు. వీడియోగ్రఫీ సర్వేలో కనుగొన్న శివలింగం ఉంటున్న ప్రాంతానికి రక్షణ కల్పించాలని గత మే 17న వారణాసి జిల్లా మేజిస్ట్రేట్‌ను ఆదేశిస్తూ సుప్రీంకోర్టు తాత్కాలిక ఆదేశాలిచ్చింది. జ్ఞానవాపి మసీదులో ముస్లింలు నమాజు చేసుకునేందుకు కూడా అత్యున్నత న్యాయస్థానం అనుమతించింది. కాగా, శివలింగం విషయంలో హిందూ వర్గాలు చేస్తున్న వాదనతో ముస్లిం వర్గాలు ఏకీభవించడం లేదు. సర్వేలో కనిపించినట్టు చెబుతున్న వస్తువు ఒక ఫౌంటేన్ అని ఆ వర్గాలు వాదిస్తున్నాయి.

డిప్యూటీ జైల్ సూపరింటెండెంట్ అరెస్ట్

చండీగఢ్: జైలులోని ఉగ్రవాదులు, గ్యాంగ్‌స్టర్లకు డ్రగ్స్, మొబైల్స్ సరఫరా చేస్తూ జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ ఒకరు పట్టుబడ్డారు. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ గురుచరణ్ సింగ్ జైలులోని గ్యాంగ్‌స్టర్లు, టెర్రరిస్టులు, ఖైదీలకు మొబైల్ ఫోన్లు , డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్టు పక్కా సమాచారం అందుకున్న ఉన్నతాధికారులు ఆయనను అరెస్ట్ చేశారు. జైలులోని హై సెక్యూరిటీ జోన్‌లో ఉన్న ఉగ్రవాదులు, గ్యాంగ్‌స్టర్లు, డ్రగ్ స్మగ్లర్లకు నెల రోజులుగా ఆయన ఐదు మొబైల్ ఫోన్లు అందించారని, అందుకు బదులుగా వారి నుంచి డబ్బులు తీసుకున్నట్టు సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్ఎస్‌పీ) సురేంద్ర లింబా తెలిపారు.

దేశ్‌ముఖ్ బెయిల్‌పై సీబీఐ అభ్యంతరం

ముంబై: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) నాయకుడు, మహారాష్ట్ర మాజీ హోంమంత్రి అనిల్ దేశ్‌ముఖ్‌పై అవినీతి, దోపిడీ, కుట్ర వంటి తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయని, అతని నేర ప్రమేయాన్ని నిర్ధారించడానికి తగిన ఆధారాలు ఉన్నందున బెయిల్ మంజూరు చేయవద్దని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) శుక్రవారం బాంబే హైకోర్టుకు విన్నవించింది. గత ఏడాది నవంబర్‌లో మనీలాండరింగ్ కేసులో తొలుత ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), ఆ తర్వాత సీబీఐ అరెస్టు చేసిన దేశ్‌ముఖ్ బెయిల్ పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ సీబీఐ అఫిడవిట్ దాఖలు చేసింది.

మోదీకి మోకరిల్లుతున్న జగన్

- మద్యం కుంభకోణంలో జగన్‌కు రూ.9 వేల కోట్ల ముడుపులు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-తిరుపతి బ్యూరో : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కేసుల నుంచి తనను రక్షించుకోవడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కాళ్ల వద్ద మోకరిల్లుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. శుక్రవారం ఆయన తిరుపతి బైరాగి పట్టెడలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని, విభజన హామీలను అమలు చేస్తామని చెప్పిన మోదీ... విశాఖకు రైల్వే జోన్, కడపకు స్టీల్ ఫ్యాక్టరీ, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోగా పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటు పరం చేయాలని ప్రయత్నించడం దారుణమన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి అన్యాయం చేసిన మోదీ విశాఖ పర్యటనను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజుల పాటు నిరసన ప్రదర్శనలు చేపడతున్నట్లు తెలిపారు. విశాఖకు వస్తున్న మోదీ సభను జయప్రదం చేసేందుకు సీఎం జగన్ నానా తంటాలు పడుతున్నారని ఎద్దేవా చేశారు. కోట్లాది రూపాయలు వెచ్చించి మూడు వేల మంది అధికారులు, ఉద్యోగులతో 500 బస్సులు ఏర్పాటు చేసి 3 లక్షల మంది జన సమీకరణ చేసి మోదీకి స్వాగతం పలకడంలో ఆంతర్యం ఏమిటో చెప్పాలన్నారు. మోదీ రాష్ట్రానికి ఏమి చేశారో తెలపాలని సీఎం జగన్‌ను ప్రశ్నించారు. కేసుల నుంచి బయటపడడానికే జగన్ ప్రధానికి సాగిల పడుతున్నాడని విమర్శలు గుప్పించారు. జగన్‌కు మద్యం మాఫియాతో సంబంధాలు ఉన్నాయని, పోలీసులకు పట్టుబడ్డ విజయసాయి రెడ్డి సమీప బంధువు శరత్ రెడ్డి నుంచి సీఎం జగన్‌కు రూ.9 వేల కోట్లు ముడుపులు అందాయని తెలిపారు. సీబీఐకి ఇదంతా కనిపించదా? అని ఘాటుగా ప్రశ్నించారు. మోదీని చూస్తే జగన్‌కు భయం కలుగుతోందని, లేకపోతే ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని ప్రధాన మంత్రిని జగన్ నిలదీయవచ్చుకదా... అని ప్రశ్నించారు. సీబీఐ కేసుల నుంచి రక్షించుకోవడానికే ప్రధానిని ప్రసన్నం చేసుకోవడంలో భాగంగా ఈ డ్రామాలు ఆడుతున్నారని రామకృష్ణ విమర్శించారు. విశాఖలో కార్మికులను అరెస్టు చేయడం సరైంది కాదని హితవు పలికారు. ప్రజా సంఘాల నేతలను గృహ నిర్బంధం చేస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలందరూ ఈ వాస్తవాలు తెలుసుకుని నిలదీయడమేకాకుండా నిరసనలు తెలిపాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళి, కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, కుమార్ రెడ్డి, రాధాకృష్ణ, నదియా, నగర కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలు నిర్వహించాలి

పార్టీని బలోపేతం చేసేందుకు ప్రజా పోరాటాలు నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. బైరాగి పట్టెడలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ జిల్లా సమితి సభ్యులు, శాఖా కార్యదర్శుల సమావేశం తిరుపతి నగర కార్యదర్శి జె.విశ్వనాథ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరయిన రామకృష్ణ మాట్లాడుతూ విజయవాడలో సీపీఐ జాతీయ మహాసభలను అందరి సహకారంతో ఘనంగా నిర్వహించుకున్నామని అన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దేశాన్ని అప్పగిస్తూ ప్రజలను తీవ్ర భయాందోళనకు గురి చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేదని, అప్పు తెస్తేనే పింఛన్లు, జీతాలు ఇచ్చే పరిస్థితి అని ఎద్దేవా చేశారు . రాష్ట్రాన్ని అభివృద్ధి చేయకపోగా, ఆర్థికంగా దివాలా తీయించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కేంద్రానికి వత్తాసు పలుకుతున్న జగన్ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథ రెడ్డి మాట్లాడుతూ సీపీఐ జాతీయ మహాసభలు విజయవంతం కావడంతో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నింపిందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాల పై పార్టీ కార్యకర్తలు ఎప్పటికప్పుడు రాజకీయ చైతన్యం కావాలన్నారు. స్థానిక సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారం కోసం పార్టీ శాఖలు ఉద్యమించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జయలక్ష్మీ, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జర్నలిస్టు ప్రతినిధులతో అక్రెడిటేషన్ కమిటీలు

ఏపీయూడబ్ల్యూజే డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్లు జారీ చేయాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేసింది. ఆమేరకు తీర్మానాన్ని ఆమోదించింది. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు రాష్ట్ర కార్యవర్గ సమావేశం శుక్రవారం విజయవాడ ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఏపీ అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. జర్నలిస్టుల సమస్యలపై సమావేశం చర్చించింది. అక్రిడిటేషన్ల గడువు డిసెంబర్ 31కి ముగియనున్నందున కొత్త అక్రెడిటేషన్ల జారీ ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేసింది. రాష్ట్ర, జిల్లాస్థాయి మీడియా అక్రెడిటేషన్ కమిటీలను వెంటనే ఏర్పాటు చేయాలని, కమిటీలలో వర్కింగ్ జర్నలిస్టు సంఘాలకు ప్రాతినిధ్యాన్ని కల్పించాలని కోరింది. సెప్టెంబర్‌లో గడువు ముగిసిన వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్‌స్కీమ్ పథకాన్ని పునరుద్ధరించి అర్హులందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలని, మూడేళ్లుగా అమలుకాని వర్కింగ్ జర్నలిస్ట్ ప్రమాద బీమా పథకం పునరుద్ధరించాలని సమావేశం డిమాండ్ చేసింది. యూనియన్ ప్రతినిధిబృందం... సమాచార పౌర సంబంధాల మంత్రిని, కమిషనర్‌ను కలిసి జర్నలిస్టుల తక్షణ సమస్యలను వివరించాలని నిర్ణయించింది. సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే ఆందోళన చేపట్టాలని తీర్మానించింది. నవంబర్ 16న జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రూపాలలో కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా శాఖలకు, అనుబంధ ప్రెస్‌క్లబ్‌లకు పిలుపు ఇచ్చింది. సమావేశానికి ముఖ్యఅతిథి, ఐజేయూ జాతీయ అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మీడియా రంగ పాత్రికేయులు క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నారని, వారికి రక్షణ కరువైందని అన్నారు. పత్రికాస్వేచ్ఛ ప్రమాదంలో ఉన్నదన్నారు. పాలకులు పాత్రికేయుల గొంతు నొక్కుతున్నారనీ, తీవ్రమైన అభియోగాలు మోపి జర్నలిస్టులను జైళ్లపాలు చేస్తున్నారని శ్రీనివాస్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. 'సేవ్ జర్నలిజం-సేవ్ జర్నలిస్ట్స్' నినాదంతో జనవరిలో జాతీయ స్థాయి ప్రచారాందోళన చేపట్టాలని ఇటీవల చెన్నైలో జరిగిన ఐజేయూ జాతీయ పదవ ప్లీనరీ నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు మేలుచేసే చర్యలు తీసుకుంటారని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంపై పెట్టుకున్న ఆశలు అడియాసలయ్యాయని అన్నారు. గతంతో పోలిస్తే రాష్ట్ర జర్నలిస్టుల పరిస్థితి దిగజారినట్లు తెలిపారు. సంఘటిత ఉద్యమాల ద్వారా సమస్యల పరిష్కారం కోసం యూనియన్ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఐజేయూ ఉపాధ్యక్షుడు అంబటి ఆంజనేయులు, కార్యవర్గసభ్యులు ఆలపాటి సురేష్ కుమార్, డి.సోమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

జనవరి 27 నుంచి లోకేశ్ పాదయాత్ర ?

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఏపీ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటు చేసుకోబోతోంది. టీడీపీ యువనేత, ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేపట్టనున్నారు. వచ్చే జనవరి 27 నుంచి లోకేశ్ పాదయాత్ర మొదలుకానుంది. ఎన్నికలకు చాలా సమయం ఉన్న నేపథ్యంలో ఇప్పటికే రెండు సార్లు పాదయాత్ర తేదీలు వాయిదా పడ్డాయి. కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు సుదీర్ఘంగా కొనసాగనున్న ఈ పాదయాత్రపై తనను కలిసిన నేతలకు లోకేశ్ స్పష్టతనిచ్చారు. జనవరి 26న హైదరాబాద్ లోని తన నివాసం నుంచి కుప్పంకు లోకేశ్ వెళ్తారు. 27న పాదయాత్రను ప్రారంభిస్తారు.

మోదీకి మద్దతు పలికితే... వైసీపీని సాగనంపడం ఖాయం

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీఎస్ఎన్ మూర్తి

విశాలాంధ్ర-విశాఖ: రాష్ట్రానికి ప్రధాని మోదీ చేస్తున్న అన్యాయానికి మద్దతు పలికితే వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు సాగనంపుతారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ పర్యటన నేపథ్యంలో జేవీ సత్యనారాయణమూర్తితో పాటు సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిల్ల పైడిరాజు, ఏఐఎస్ఎఫ్ నాయకుడు ఫణీంద్రలను పోలీసులు శుక్రవారం మధ్యాహ్నం అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో అరెస్ట్ చేశారు. అనంతరం వారిని టూ టౌన్ పోలీస్ స్టేషన్ కి తరలించారు. ఈ సందర్భంగా స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వారు నినాదాలు చేశారు. జేవి సత్యనారాయణమూర్తి మీడియాతో మాట్లాడుతూ... మోదీ రాష్ట్రానికి మేలు చేయకపోగా విశాఖలోని ప్రతిష్ఠాత్మక స్టీల్ ప్లాంట్‌ని ప్రైవేటుపరం చేయడానికి తెగించారని, దీనిని నిరసిస్తూ ప్రజలు, కార్మికులు తీవ్రంగా నిరసిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శాసనసభలో మొక్కుబడిగా తీర్మానం చేసి చేతులు దులుపుకుందని, కేంద్రంపై ఏ రకంగానూ రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవడం లేదన్నారు. 2019 ఎన్నికలకు ముందు విశాఖలో జరిగిన బహిరంగ సభలో విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారని గుర్తు చేశారు. జోన్ ఏర్పాటు కోసం ఓఎస్‌డి నియామకం కూడా జరిగినా ఈ రోజుకీ రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కాలేదని, ఎప్పటి నుంచి ప్రారంభిస్తారో చెప్పడం లేదని విమర్శించారు. పోలవరం నిర్వాసితులకు పరిహారం, పవర్ ప్రాజెక్టులతో తమకు సంబంధం లేదని ఆనకట్ట వరకే నిధులు ఇస్తామని కేంద్ర ప్రభుత్వం చెప్పడం రాష్ట్ర ప్రజలను మోసగించడమేనన్నారు. విభజన చట్టంలోని అంశాలను అమలు చేయకపోగా అపహాస్యం చేసే విధంగా కేంద్రంలోని మోదీ సర్కారు వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగం ప్రకారం నిరసన తెలిపే హక్కును అణిచివేస్తూ ప్రధాని రాక సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున అక్రమ అరెస్టులకు పాల్పడటాన్ని ఖండించారు. రాష్ట్ర ప్రయోజనాలపై చిత్తశుద్ధి ఉంటే శనివారం జరిగే బహిరంగ సభలో ప్రధానిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేయాలన్నారు.

అరెస్టులకు భయపడం

ప్రధాని మోదీ విశాఖ పర్యటన సందర్భంగా పోలీసుల అక్రమ అరెస్టులను సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిల్ల పైడిరాజు ఖండించారు. ఎంతమందిని అరెస్టు చేసినా ప్రజల్లో ఉన్న ఆగ్రహాన్ని తగ్గించలేరని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని ప్రధానితో ముఖ్యమంత్రి ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు.

ఏపీపీఎస్సీ ప్రిలిమ్స్ పరీక్షల షెడ్యూలు వాయిదా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) (గ్రూప్-1 ప్రిలిమ్స్ సర్వీసెస్ షెడ్యూలును వాయిదా వేశారు. పరిపాలనా కారణాల రీత్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఏపీపీఎస్సీ కార్యదర్శి హెచ్.అరుణ్‌కుమార్ తెలిపారు. తొలుత ఈనెల 18వ తేదీ నుంచి ప్రిలిమ్స్‌కు షెడ్యూలు ప్రకటించగా, ప్రస్తుతం దానిని వాయిదా వేశారు. వచ్చే ఏడాది జనవరి 8వ తేదీన పరీక్షల షెడ్యూలును ఖరారు చేస్తారు.

ఉన్నత విద్యా పర్యవేక్షణ, నియంత్రణ కమిషన్ చైర్‌పర్సన్‌గా వెంకట రమణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్య పర్యవేక్షణ, నియంత్రణ కమిషన్ చైర్‌పర్సన్‌గా జస్టిస్ ఎం.వెంకటరమణను (హైకోర్టు రిటైర్డ్ జడ్జి) ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఉన్నత విద్యా ప్రధాన కార్యదర్శి జె.శ్యామలరావు ఉత్తర్వులు జారీ జేశారు. ఈ పదవిలో ఆయన మూడేళ్లపాటు కొనసాగుతారు.

నటనకు ప్రాధాన్యమున్న చిత్రాలే ముఖ్యం: కృతిశెట్టి

హైదరాబాద్: ఏ హీరోయిన్‌కి అయినా ఓ సినిమా క్లిక్ అయిందంటే ఆఫర్లు వరుస కడుతుంటాయి. టాలీవుడ్‌లో అలా తన అదృష్టాన్ని పరీక్షించుకుంది నటి కృతిశెట్టి. తొలి చిత్రం 'ఉప్పెన'లో బేబమ్మగా అలరించి భారీ విజయం సొంతం అందుకుందీ బెంగళూరు బ్యూటీ. అంతేకాదు తెలుగు ప్రేక్షకుల్లో పెద్ద ఎత్తున అభిమానులను కూడా పెంచుకుంది. 'ఉప్పెన' విజయం వరుసగా అరడజను అవకాశాలు తీసుకొచ్చింది. నానితో 'శ్యామ్ సింగ రాయ్', బంగార్రాజు' చిత్రాలు హిట్ కావడంతో హ్యాట్రిక్ విజయం సొంతం చేసుకుంది. తదుపరి మూడు చిత్రాలు రామ్ 'ది వారియర్' నితిన్ 'మాచర్ల నియోజకవర్గం', సుధీర్‌బాబు 'ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి' సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తాపడ్డాయి. హ్యాట్రిక్ హిట్, హ్యాట్రిక్ ఫ్లాప్‌తో రిస్క్‌లో పడింది కృతి. దీంతో వచ్చిన ప్రతి అవకాశాన్ని ఓకే అనకుండా ఆచితూచి అడుగేయాలనే ఆలోచనకు వచ్చినట్లు ఆమె సన్నిహితులు చెబుతున్నారు. ప్రస్తుతం అంగీకరించే సినిమాలకు కాస్త టైమ్ తీసుకోవాలనుకుంటుందట. ప్రస్తుతం కృతిశెట్టి నాగ చైతన్య-వెంకట్ ప్రభు కాంబినేషన్‌లో తెలుగు, తమిళంలో ఓ సినిమా చేస్తున్నారు. ఇది కాకుండా మలయాళంలో ఓ సినిమా చేస్తున్నారు.

విశాలాంధ్ర రీల్

శాకుంతలంపై గుణశేఖర్ ధీమా

హైదరాబాద్: సమంత తాజాగా రెండు మహిళా ప్రాధాన్యం ఉన్న చిత్రాల్లో నటించారు. అందులో ఒకటి 'యశోద', రెండోది గుణశేఖర్ దర్శకత్వం వహించిన 'శాకుంతలం'. సమంత స్టార్‌డమ్, ఇమేజ్‌ను దృష్టి పెట్టుకుని దర్శక నిర్మాతలు చేసిన సాహసం ఈ రెండు చిత్రాలు. అందుకే 'యశోద' సినిమా రిజల్ట్ ఎలా ఉంటుందా? అని గుణ శేఖర్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఎందుకంటే ఈ రెండు చిత్రాల్లోనూ స్టార్ హీరోలు లేరు. సమంతే కీలకం. యశోద ప్రమోషన్స్‌లో సమంత లేకపోవడం వల్ల ఆమె పేరుకున్న క్రేజ్‌తో ప్రేక్షకులు థియేటర్లకు వస్తారా లేదా అన్న సందిగ్ధంలో ఉన్నారు నిర్మాతలు. గతంలో సమంత కీలకంగా నటించిన 'యు టర్న్', 'ఓ బేబీ' చిత్రాలు మంచి టాక్ తెచ్చుకున్నా.. కమర్షియల్‌గా పెద్దగా వర్కవుట్ కాలేదనే అసంతృప్తి నిర్మాతల్లో ఉందని అప్పట్లో టాక్. యశోద సినిమా సక్సెస్‌ఫుల్‌గా ముందుకెళ్తే.. తాను తీసిన 'శాకుంతలం' కూడా సక్సెస్‌ఫుల్‌గా ముందుకెళ్తుందని గుణశేఖర్ నమ్మకం. అయితే ఆయన ఆలోచన కథల పరంగా కాదు. మార్కెట్, క్రేజ్ గురించి. 'యశోద'తో పోల్చితే 'శాకుంతలం' బడ్జెట్ కూడా ఎక్కువే. 'యశోద' ఎలాంటి మ్యాజిక్ చేస్తుందన్నది ప్రస్తుతం ఆసక్తిగా మారింది. ఈ సినిమాకు మంచి కలెక్షన్లు వస్తే ఇన్‌డైరెక్ట్‌గా 'శాకుంతలం' చిత్రానికి కూడా హెల్ప్ అవుతుంది. గుణశేఖర్ నమ్మకం నిజం అయ్యేలా ఉంది. శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చిన 'యశోద' ప్రేక్షకులను ఆకట్టుకుంది.

ధోనీతో లోకేశ్ కనగరాజ్ చిత్రం

చెన్నై: కమల్‌హాసన్ హీరోగా నటించిన 'విక్రమ్' సక్సెస్ తర్వాత చాలామందికి లోకేశ్ కనగరాజ్ ఫేవరెట్ డైరెక్టర్ అయిపోయాడు. ఈ సినిమాని గతంలో తీసిన కార్తీ 'ఖైదీ' లింక్ చేస్తూ హాలీవుడ్ తరహాలో లోకేశ్ సినిమాటిక్ యూనివర్స్(ఎల్‌సీయూ)నే క్రియేట్ చేశాడు. విజయ్ సేతుపతి, ఫహాద్ ఫాజిల్, సూర్య వంటి ఎంతోమంది మంచి నటులను పరిచయం చేశాడు. దీన్లో భాగంగా త్వరలో మరి కొన్ని చిత్రాల చేసేందుకు సిద్ధమవుతున్నాడు. అలాగే త్వరలో 'దళపతి' విజయ్ కూడా ఈ సినిమాటిక్ యూనివర్స్‌లో జాయిన్ అవుతాడని ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ తరుణంలోనే మరో క్రేజీ వార్త నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఎల్‌సీయూలో వచ్చే తదుపరి సినిమాల్లో ఓ పూర్తి స్థాయి పాత్రలో క్రికెటర్ ధోని నటింపజేసేలా ప్రయత్నం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ భారత మాజీ కెప్టెన్ ఓ బ్యానర్ స్థాపించి తమిళంలో సినిమాలు చేసేందుకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. దానికి కొనసాగింపుగా ఎల్‌సీయూలో ఆయన్ని కూడా భాగంగా చేయాలని లోకేశ్ అనుకుంటున్నట్లు వినికిడి. ఈ వార్తలు ఎంతవరకు నిజమో తెలియాలంటే మరికొంతకాలం ఆగాల్సిందే. కాగా.. 'విక్రమ్' హిట్‌తో వచ్చే ఏడేళ్ల పాటు బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో లోకేష్ ఫుల్ బిజీగా ఉంటాడని తెలుస్తోంది. ఇందులో ఖైదీ 2, దళపతి 67, విక్రమ్ 2, ఇరుంబుకై మాయావి, అలాగే మరికొన్ని సినిమాలు ఉన్నాయి.

సండ్రపాటి సైదాను పరామర్శించిన నారాయణ

విశాలాంధ్ర-వినుకొండ: అనారోగ్యంతో హైదరాబాదులోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వినుకొండ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సండ్రపాటి సైదాను సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యుడు డాక్టర్ కె.నారాయణ పరామర్శించారు. ఆయనతోపాటు చండ్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ కోశాధికారి చెన్నకేశవరావు, సైదా అల్లుడు షేక్ వలి, మనుమడు గౌస్ తదితరులు ఉన్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితులను గురించి డాక్టర్లను విచారించి మెరుగైన చికిత్సలను అందించాలని నారాయణ కోరారు. సైదా కమ్యూనిస్టు పార్టీలో నిజాయతీగా పనిచేసిన కార్యకర్త అని, నాయకుడిగా, మైనారిటీల కోసం పాటుబడిన వ్యక్తి అని నారాయణ అన్నారు. సైదా అనారోగ్యం నుంచి తొందరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

మైనారిటీల సంక్షేమంలో ముందున్నాం

అబుల్ కలాం ఆజాద్ జయంతి సభలో సీఎం జగన్

విశాలాంధ్ర-గుంటూరు: భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహించడం జరుగుతుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఏపీ మైనారిటీల సంక్షేమ శాఖ అధ్వర్యంలో ఆజాద్ 135వ జయంతి వేడుకల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సీఎం జగన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘననివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... మౌలానా అబుల్ కలాం జయంతిని 'మైనార్టీస్ డే'గా తొలిసారి 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రకటించారన్నారు. నాన్న ముస్లిం సోదరుల పట్ల, మైనార్టీల సంక్షేమం పట్ల ఒక అడుగు వేస్తే, ఆయన కొడుకుగా మీ జగన్ రెండు అడుగులు ముందుకు వేస్తున్నాడన్నారు. కేవలం ఈ మూడేళ్ల 4 నెలల కాలంలోనే డీబీటీ ద్వారానే 44,13,773 మైనార్టీ కుటుంబ సభ్యుల ఖాతాల్లోకి రూ.10,309 కోట్లు జమ చేశామని, ఇక నాన్ డీబీటీ పద్ధతిలో కూడా తీసుకుంటే మరో 16,41,622 మైనార్టీ కుటుంబ సభ్యులకు మరో రూ.10 వేల కోట్లు మేలు జరిగిందన్నారు. రాష్ట్రం మొత్తం మీద 65,783 ఎకరాల వక్ఫ్ భూములుండగా.. అనేక చోట్ల అవి అన్యాక్రాంతమైన పరిస్థితులు కనిపిస్తున్నాయని, వీటిని ఒక పద్ధతి ప్రకారం తిరిగి వక్ఫ్‌కు స్వాధీనం చేసుకునే కార్యక్రమం మొదలుపెట్టామన్నారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కోసం అన్ని వివరాలను డిజిటలైజేషన్ చేస్తున్నామని, ఇప్పటివరకు 3,772 ఆస్తులకు సంబంధించి డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సర్వే పూర్తి చేసి వాటిని కంచె వేసి రక్షించే కార్యక్రమం చేస్తున్నామన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టంకు సంబంధించి రూ.287 కోట్లు అడిగారని, అది ఇప్పటికే మంజూరు చేశామని, శంకర్ విలాస్ సెంటర్‌లో ఆర్వోబీ ప్రాజెక్టు గురించి అడిగారని రూ.131 కోట్లు ఖర్చయ్యే ఈ ప్రాజెక్టు త్వరలోనే ప్రారంభం అవుతుందన్నారు. గుంటూరు వెస్ట్‌లో ముస్లిం కౌన్సిలింగ్ హాల్ కమ్ లైబ్రరీ సెంటర్ కోసం అడిగారని, అది కూడా మంజూరు చేస్తున్నానని హామీ ఇచ్చారు. ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్ బాషా మాట్లాడుతూ... 2019 నుంచి మైనార్టీలకు సువర్ణ అధ్యాయమని అన్నారు. రాష్ట్రంలో ఇమామ్‌లు, మౌజమ్‌లకు ఇచ్చే గౌరవ భృతిని గత ప్రభుత్వం పక్కనపెడితే తమ ప్రభుత్వం ఆ బకాయిలు చెల్లించడమేకాక పెంచిన గౌరవ భృతిని చెల్లిస్తోందన్నారు. గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, ఎమ్మెల్యే ముస్తఫా ప్రసంగించారు.

టీమిండియాను 'చోకర్స్' అనొచ్చు: కపిల్

న్యూఢిల్లీ: ఇటీవల కాలంలో వరసగా ఐసీసీ మెగా టోర్నీల్లో టీమిండియా ఘోరంగా విఫలమవుతోంది. తాజాగా ఆస్ట్రేలియా వేదికగా జరుగుతోన్న టీ20 ప్రపంచకప్ సెమీస్‌లోనూ ఇంగ్లండ్ చేతిలో చిత్తుగా ఓడి నిష్క్రమించింది. కనీసం పోరాటం చేయకుండా చేతులెత్తేయడంతో అభిమానులను మరింత బాధించింది. ఈ క్రమంలో టీమిండియా మాజీ కెప్టెన్, క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఐసీసీ ఈవెంట్లలో విఫలమవుతున్న భారత్ జట్టును 'చోకర్స్'గా పిలవొచ్చని ఓ ఆంగ్ల ఛానెల్‌తో మాట్లాడుతూ పేర్కొన్నాడు. కీలకమైన టోర్నీల్లో ఉండే ఒత్తిడిని తట్టుకోలేక చేతులెత్తేసే టీమ్‌లను ఉద్దేశించి క్రికెట్ పరిభాషలో 'చోకర్స్'గా అభివర్ణిస్తారు. "టీమిండియాను చోకర్స్ అని పిలవడంలో తప్పేమీ లేదు. అయితే ఇలాంటి సమయంలో కాస్త పరుషమైన పదాలను వాడదల్చుకోలేదు. ఎందుకంటే ఇందులోని ఆటగాళ్లు కొన్ని సంవత్సరాల నుంచి వ్యక్తిగతంగా రాణిస్తున్నారు. అందుకే ఇంగ్లండ్‌పై ఓడినప్పటికీ అభిమానులు, విశ్లేషకులు మరీ దారుణంగా మాట్లాడాల్సిన అవసరంలేదు' అని కపిల్ వెల్లడించారు. కపిల్ నాయకత్వంలోని భారత్ 1983 వన్డే ప్రపంచకప్ గెలుచుకోగా.. ఆ తర్వాత ధోనీ సారథ్యంలో టీ20, వన్డే కప్‌లను సొంతం చేసుకొంది. 2007 నుంచి ఇప్పటి వరకు నాలుగుసార్లు పొట్టి ప్రపంచకప్ సెమీస్‌కు చేరుకోగా.. ఒక్కసారి మాత్రమే కప్‌ను సాధించింది.

ద్రవిడ్‌పై సర్వత్రా విమర్శలు

అడిలైడ్: టీ20 ప్రపంచకప్‌లో భారత్ ఆట సెమీఫైనల్లోనే ముగిసింది. సెమీస్‌లో సత్తా చాటి మెల్‌బోర్న్ క్రికెట్ మైదానంలో మరోసారి పాకిస్తాన్‌ను ఢీకొడుతుందని, క్రికెట్ ప్రపంచం ఎదురు చూస్తున్న ఫైనల్ సాధ్యమవుతుందని భావించిన వారందరికీ ఇంగ్లండ్ బలమైన షాకిచ్చింది. గురువారం జరిగిన రెండో సెమీస్‌లో ఇంగ్లండ్ 10 వికెట్ల తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. దాంతో టైటిల్ గెలిచే సువర్ణావకాశం మరోసారి చేజారింది. ఈ పరాజయంలో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ పాత్ర ఎంతో ఉందో హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్‌ది అంతకుమించి ఉంది. ఐసీసీ టైటిళ్లు గెలవలేదని కోహ్లి-రవిశాస్త్రి ద్వయాన్ని పక్కనపెట్టేసిన బీసీసీఐ.. ఆ బాధ్యతలను వాల్‌గా పేరొందిన ద్రవిడ్ చేతిలో పెట్టింది.

అనవసర ప్రయోగాలతో...

ఇప్పటివరకు ఎవరికీ ఇవ్వనంత డబ్బును ఆఫర్ చేసింది. కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ ఏడాదికి రూ.10 కోట్ల వేతనాన్ని అందుకుంటున్నాడు. భారత క్రికెట్ చరిత్రలోనే ద్రవిడ్ అంతటి కాస్ట్‌లీ కోచ్ మరొకరు లేరు. అతను మాత్రం జట్టును విశ్వవిజేతగా నిలబెట్టకపోగా అనవసర ప్రయోగాలతో నాశనం చేశాడు. కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన వెంటనే విరాట్ కోహ్లిని కెప్టెన్సీ నుంచి తప్పించి రోహిత్ శర్మను సారథిని చేశాడు. మిషన్ మెల్‌బోర్న్ పేరిట గత ఏడాదిగా చేసిన ప్రయత్నాలన్నీ బెడిసికొట్టాయి. తీరిక లేని క్రికెట్‌తో ఆటగాళ్లు అలసిపోయారని, జట్టు ఎంపికలో పొరపాట్లు జరిగాయని విమర్శలు రావడంతో కీలక ఆటగాళ్లకు తరచుగా విశ్రాంతినిస్తూ, చాలామంది కుర్రాళ్లకు అవకాశాలిస్తూ ద్రవిడ్ ప్రయోగాల మీద ప్రయోగాలు చేశాడు.

కుదురుకునే అవకాశం ఇవ్వలేదు...

ఇక కుర్రాళ్లకు బోలెడన్ని అవకాశాలిచ్చినా.. అందులో ఒక ప్రణాళిక అంటూ కనిపించలేదు. మ్యాచ్ మ్యాచ్‌కూ మార్పులు చేర్పులు చేస్తూ ఎవ్వరికీ కుదురుకునే అవకాశం ద్రవిడ్ ఇవ్వలేదు. అర్ష్‌దీప్ ఒక్కడు జట్టులో స్థిరపడ్డాడు. పెద్దగా నిరూపించుకున్నదేమీ లేకపోయినా దీపక్ హుడాకు ప్రపంచకప్ జట్టులో చోటు దక్కడం ఆశ్చర్యకరం. ఒక ప్రణాళిక అంటూ లేకుండా ఇష్టానుసారం ప్రయోగాలు చేసి చివరికి పెద్దగా టీ20 క్రికెట్ ఆడని షమీ, అశ్విన్‌లను ప్రపంచకప్ కోసం ఎంపిక చేయడంలో ఔచిత్యమేంటో అర్థం కాని విషయం.

ఉమ్రాన్ మాలిక్‌ను పక్కనపెట్టి...

నిలకడగా 150 కి.మీ వేగంతో బంతులేసే ఉమ్రాన్ మాలిక్ ఒకట్రెండు మ్యాచ్‌ల్లో విఫలం కాగానే పక్కన పెట్టేశాడు. మిగతా ఆటగాళ్లకు ఇచ్చినట్లు అవకాశాలు ఇచ్చి ఉంటే అతను ఈ ప్రపంచకప్‌లో జట్టుకు బాగా ఉపయోగపడేవాడేమో. రవి బిష్ణోయ్ పరిస్థితీ అంతే. ప్రపంచ క్రికెట్లో ఆఫ్ స్పిన్నర్ల ఆధిపత్యానికి తెరపడి చాలా కాలం అయింది. కొన్నేళ్ల నుంచి అంతర్జాతీయ క్రికెట్లో అయినా, లీగ్ క్రికెట్లో అయినా మణికట్టు స్పిన్నర్లదే హవా. భారత క్రికెట్లోనూ అందుకు భిన్నమేమీ కాదు. చాహల్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్ లాంటి మణికట్టు స్పిన్నర్లే సత్తా చాటుతూ వస్తున్నారు. ఇలాంటి స్థితిలో ప్రపంచకప్‌కు అశ్విన్, అక్షర్ పటేల్‌లను ఎంపిక చేయడం విడ్డూరం.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.